జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 133 | హైదరాబాద్, మార్చి 02 మంగళవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

# కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న మంత్రి ఈటల

హైదరాబాద్,మార్చి 01 (ప్రజాపాలన ప్రతినిధి) : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ కరోనా వ్యాక్సిన్ తీసుకున్నారు. రెండో దశ వ్యాక్సినేషన్‌లో భాగంగా హుజూరాబాద్‌లోని ప్రాంతీయ దవాఖానలో కొవిషీల్డ్ టీకా తొలి డోసు వేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరోనా రెండో దశ వ్యాప్తి లేదని చెప్పారు. 60 ఏండ్లు పైబడినవారితోపాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు టీకా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కరోనా వ్యాక్సిన్‌పై అపోహలు వద్దని సూచించారు. అర్హులైన వారంతా టీకా కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న దవాఖానల్లో టీకా వేయించుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడుత కొవిడ్ వ్యాక్సినేషన్ ప్రారంభమయ్యింది. ఇందులో భాగంగా 60 ఏండ్లు పైబడివారితోపాటు దీర్ఘకాలి వ్యాధిగ్రస్థులకు టీకాలు వేయనున్నారు. రెండు కేటగిరీల్లో 50 లక్షల మంది ఉంటారని అధికారులు అంచనావేస్తున్నారు. తొలిరోజు 90 కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి టీకా పంపిణీ చేస్తారు. cowin.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి టీకా వేయనున్నారు.దేశవ్యాప్తంగా రెండో దశ కరోనా టీకా పంపిణీ ప్రారంభమయ్యింది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో వ్యాక్సిన్ తీసుకున్నారు. హైదరాబాద్ కంపెనీ అయిన భారత్ బయోటెక్ తయారు చేసిన కొవాగ్జిన్‌ను ప్రధాని వేయించుకున్నారు. ఈ సందర్భంగా కరోనాపై జరుగుతున్న పోరులో శాస్త్రవేత్తలు, డాక్టర్లు చేస్తున్న కృషిని ప్రధాని కొనియాడారు.





## బీజేపీ ఎమ్మెల్సీకి కౌంటర్ ఇచ్చిన కేటీఆర్

హైదరాబాద్,మార్చి 01 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలంగాణలో విద్య, ఉద్యోగాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ బీజేపీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు విసిరిన సవాలుకు మంత్రి కేటీఆర్ దిమ్మదిరిగే కౌంటర్ ఇచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ గేటు బయట సోమవారం ఉదయం 11 గంటల కల్లా వస్తాను.. మీరూ రండి.. చర్చిద్దాం అంటూ ఆదివారం రామచందర్‌రావు ట్వీట్ చేశారు. దీనిపై సోమవారం ట్విటర్‌లో కేటీఆర్ స్పందించారు. గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీ గారు ఇస్తానన్న 12 కోట్ల ఉద్యోగాలు (ఏడాదికి 2 కోట్లు), జన్‌ధన్ ఖాతాల్లో వేస్తానన్న రూ.15 లక్షల సమాచారం సేకరించడంలో నేను బిజీగా ఉన్నాను. కానీ ఇప్పటివరకు సమాధానం మాత్రం ఎన్‌డీఏ (ఎన్-నో, డీ-డేటా, ఏ-అవైలబుల్)నే. మీ దగ్గర ఏమైనా సమాధానం ఉంటే షేర్ చేయండి అంటూ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు.

## హైదరాబాద్ ఘట్‌కేసర్‌లో యువతుల దందా, స్వచ్ఛంద సంస్థ పేరుతో వసూళ్లు



హైదరాబాద్,మార్చి 01 (ప్రజాపాలన ప్రతినిధి) : ఘట్ కేసర్ లో స్వచ్ఛంద సంస్థ పేరుతో అమ్మాయిలు చందాలు వసూలు చేయటం కలకలం రేపింది. చందాలు వసూలు చేస్తున్న రాజస్తాన్, గుజరాత్ కి చెందిన ఆరుగురు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన ఆరుగురు అమ్మాయిలు బృందాలుగా ఏర్పడి వాహనదారుల నుంచి డబ్బు వసూలు చూస్తున్నారు.స్వచ్ఛంద సంస్థ పేరు చెప్పాలని వాహనదారులు అడిగితే సమాధానం ఇవ్వడం లేదు. పైగా, డబ్బు ఇవ్వని వారిని బెదిరిస్తున్నారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపైన పోలీసులు లేని చోట నిర్మానుష్యమైన ప్రాంతాల్లో ఈ దందా చేస్తున్నారు. వాహనాలు ఆపి స్వచ్ఛంద సంస్థ పేరుతో చందాలు వసూలు చేస్తున్న యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఇటీవల గుంటూరులోనూ ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి వారితో వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. వారికి డబ్బు ఇవ్వొద్దని సూచించారు. ఎవరికైనా ఇలాంటి వారు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పోలీసులు చెప్పారు.



## వామన్ రావు దంపతుల హత్య కేసు హైకోర్టు విచారణ

హైదరాబాద్,మార్చి 01 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలంగాణలో సంచలనం రేకెత్తించిన వామన్ రావు దంపతుల హత్య కేసును సోమవారం హైకోర్టు విచారించింది. వాద ప్రతివాదనలు విన్నతర్వాత హై కోర్టు తదుపరి విచారణను మార్చి 15వ తేదీకు వాయిదా వేసింది. సెక్షన్ 164 కింద %ూ2...ూ%3ల స్టేట్‌మెంట్ ఎందుకు రికార్డ్ చేయలేదని కోర్టు ప్రశ్నించింది. మంథని సంఘటనా స్థలంలో జరిగిన

మిగతా 2లో..

## పెద్దగట్టు ప్రాశస్త్యాన్ని పెంచిన ఘనత కేసీఆర్‌దే:జగదీశ్ రెడ్డి



సూర్యాపేట,మార్చి 01 (ప్రజాపాలన ప్రతినిధి) : పెద్దగట్టు జాతర ప్రాశస్త్యాన్ని పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. యాదవులపై ఉన్న ప్రేమతో జాతరకు భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆయన పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడారు. పెద్దగట్టు జాతరలో సకల సదుపాయాల కల్పనపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. భక్తులు భారీగా తరలివచ్చినా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. స్వరాష్ట్రంలో పెద్దగట్టు జాతర కన్నుల పండువగా సాగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. 'భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 50 ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించాం. సీసీకెమెరాలతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశాం. కరోనా నేపథ్యంలో శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పరిశుభ్రతను తొలిప్రాధాన్య అంశంగా తీసుకొని జాతర పరిసరాలను సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. కాళేశ్వరం జలాల రాకతో రైతులు సంతోషంగా జాతర జరుపుకుంటున్నారు' అని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. జాతర అత్యంత వైభవంగా సాగుతుందన్నారు. లక్షలాది మంది భక్తులకు తాగునీరు, వసతులు కల్పించిన మంత్రి జగదీశ్ రెడ్డికి యాదవ సామాజికవర్గం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. యాదవులు ఇలవేల్పు లింగమంతుల స్వామి కరుణాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. స్వరాష్ట్రంలో ఆలయాలకు పూర్వ వైభవం తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. యాదవుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు.

## బీజేపీకి అంత ధైర్యం ఉందా:రేవంత్ రెడ్డి



హైదరాబాద్,మార్చి 01 (ప్రజాపాలన ప్రతినిధి) : కేసీఆర్ పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడం పై నేను రిటన్ కంప్లైంట్ ఇస్తా, చర్యలు తీసుకునే ధైర్యం బీజేపీకి ఉందా టీబీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నిజానికి సంజయ్, కేసీఆర్ వేరువేరుగా కనిపించినప్పటికీ ఇద్దరూ ఒక్కటేనని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. "ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్ కు కేసిఆర్ హాజరు కాకుండా, హాజరు పట్టికలో కేసీఆర్‌కు బదులు మరోకరితో సంతకాలు చేయించారు. కేసీఆర్ పార్లమెంట్‌కు ఎన్నిసార్లు హాజరయ్యారు? సంతకాలు ఏవరివి? బండి సంజయ్ ఫోరెన్సిక్ టెస్ట్ చేపించగలడా? కేసీఆర్ చదువుకుంది బీఏ. కానీ ఎంఏ చదువుకున్నట్లు పార్లమెంట్‌కు సమాచారం ఇచ్చారు. బండి, కారు ఒక్కటే. కేసీఆర్‌ను సంజయ్‌ను వేరు వేరుగా చూడలేం" అని ఎంపీ రేవంత్ రెడ్డి అన్నారు.




## ముంబై బ్లాక్‌అవుట్ వెనుక చైనా.. భారత విద్యుత్ వ్యవస్థపై సైబర్ దాడి



ముంబై,మార్చి 01 (ప్రజాపాలన ప్రతినిధి) : ఇండియాపై దాడికి చైనా కొత్త ఎత్తులు వేస్తోంది. సరిహద్దులో ఆక్రమణలు, కవ్వింపు చర్యలతోపాటు ఇప్పుడు ఏకంగా సైబర్ దాడికే తెగబడుతున్నట్లు తాజాగా ఓ అధ్యయనం తేల్చింది. అమెరికాకు చెందిన రికార్డెడ్ ఫ్యూచర్ అనే సంస్థ చేసిన అధ్యయనంలో కొన్ని సంచలన విషయాలు వెల్లడయ్యాయి. దేశ విద్యుత్ వ్యవస్థనే లక్ష్యంగా చేసుకొని చైనా సైబర్ దాడికి పాల్పడుతున్నట్లు ఇందులో తేలింది.

### అసలేం జరిగింది?

12 భారత ప్రభుత్వ రంగ సంస్థల కంప్యూటర్ నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకొని చైనాకు చెందిన అధికార సైబర్ గ్రూపులు దాడికి పాల్పడినట్లు ఈ అధ్యయనంలో తేలింది. ఈ 12 సంస్థల్లో ప్రధానంగా విద్యుత్ రంగానికి చెందినవే అధికంగా ఉన్నాయి. దేశంలో అతిపెద్ద విద్యుత్ సంస్థ అయిన ఎన్టీపీసీతోపాటు విద్యుత్ డిమాండ్, సరఫరాను క్రమబద్ధీకరించి పవర్ గ్రిడ్‌ను నిర్వహించడంలో కీలకపాత్ర పోషించే ఐదు ప్రధాన ప్రాంతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్లపై సైబర్ దాడి జరిగింది. గతేడాది మే నుంచి ఈ దాడి ప్రారంభమైనట్లు గుర్తించారు. ఇండియన్ నేషనల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెంటర్ (ఎన్‌సీఐఐపీసీ) ప్రకారం ఈ 12 సంస్థలు చాలా కీలకమైనవే కావడం గమనార్హం.

### ఆ సాఫ్ట్‌వేర్ వల్లే..

గతేడాది తూర్పు లఢాక్‌లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలోనే ఈ దాడి ప్రారంభమైంది. అదే సమయంలో భారత్‌లోనే విద్యుత్ వ్యవస్థను లక్ష్యంగా చేసుకొనేలా ఒక ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను చైనా సంస్థలు అధికంగా వినియోగించినట్లు ఈ అధ్యయనంలో తేలింది.

మిగతా 2లో..

## ఈ నెల 6వ తేదీ లోగా బార్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి:జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి,మార్చి 1, ( ప్రజాపాలన ప్రతినిధి ) :ప్రొహిబిషన్, ఎక్సైజ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని బెల్లంపల్లి పరిధిలో నూతనంగా 2 బార్ల ఏర్పాటు కోసం ఈ నెల 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు ఒక లక్ష రూపాయలు దరఖాస్తు రుసుము (తిరిగి ఇవ్వబడదు) చలానా ద్వారా చెల్లించి ఫారం-1 ద్వారా తమ దరఖాస్తుకు 3 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ ప్రతులను జత చేసి జిల్లా మద్యనిషేధ. ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో గడువు తేదీ లోగా సమర్పించాలని, ఈ నెల 8వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన నూతన లైసెన్స్ దారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో 2 నూతన బార్లను సంవత్సరానికి 42 లక్షల రూపాయలు బార్ ఎక్సైజ్ టాక్స్ చెల్లించవలసి ఉంటుందని, ఈ అవకాశాన్ని ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ వడ్లమూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళి



పాలేరు (ప్రజాపాలన ప్రతినిధి) మార్చి 1 :ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మండల పరిధి లోని కోనాయిగూడెం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో లిమార్చి ఒకటో తేదీన మాదిగ అమరవీరుల దినంలి ఘనంగా నిర్వహించారు.గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరుకుపల్లి రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నేలకొండపల్లి లిమండల అధ్యక్షుడు వడ్లముడి వెంకటేశ్వర్లు మాదిగ హాజరై పూలమాల వేసి నివాళులర్పించారులిల. ఈ సందర్భంగా లివడ్లముడి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం, మాదిగ జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాల పునాదుల పైన వర్గీకరణ సాధించి చరిత్ర నిర్మిస్తామని, వర్గీకరణ సాధించేవరకు అలుపెరగని పోరాటం చేస్తామని తెలియజేశారు. మాదిగ అమరవీరుల త్యాగాలు మరవబోమని మాదిగ మహిళలు అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చెరుకుపల్లి శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు చెరుకుపల్లి రాజేష్, మాజీ గ్రామ అధ్యక్షుడు వడ్లమూడి గురవయ్య, నాగేశ్వరరావు, రాములు, వెంకటేశ్వర్లు, రాంబాబు, ఎల్లయ్య, చెరుకుపల్లి ఉపేందర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల్ లో ఓక్యూలస్ ఐ క్లినిక్ ప్రారంభం



మేడిపల్లి, ఫిబ్రవరి 1 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్ ప్రజలకు మెరుగైన కంటి పరీక్షలు, నాణ్యమైన కంటి అద్దాలు అందించాలనే ఉద్దేశంతో ఉప్పల్ ప్రధాన రహదారి మేకల కాంప్లెక్స్ లో ఓక్యూలస్ ఐ క్లినిక్ ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు సిద్దు పేర్కొన్నారు. ఈ ఐ క్లినిక్ ప్రారంబోత్సవానికి ముఖ్య అతిథులుగా అభినవ్ ఐ హాస్పిటల్ ఎం.డి.డాక్టర్. వేణుగోపాల్ రావు, ఉప్పల్ ఎస్ ఐ జయరాంలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా వివిధ కంటి పరీక్షలు, కళ్లజోళ్లు ఉంచినందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సిద్దు మాట్లాడుతూ కళ్లజోళ్లు నాలుగు వందల రూపాయల నుండి యాభై వేల వరకు ఉన్నాయని, కంటి పరీక్షలు నిపుణులైన వైద్యులతో నిర్వించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సరుకులు సరఫరా చేసేందుకు స్థానికులకు అవకాశం

### జిల్లా కలెక్టర్ భారతి హొళ్ళికేరి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి,మార్చి 1, ప్రజాపాలన :జిల్లాలోని 3 మైనార్టీ గురుకుల పాఠశాలలు బెల్లంపల్లి (బాలికలు), చెన్నూర్ (బాలురు), మంచిర్యాల (బాలికలు)తో పాటు బాలికల జూనియర్ కళాశాల లకు ఈ సంవత్సరం ముగింపు వరకు, 2021-22 విద్యా సంవత్సరానికి గాను సరుకులు సరఫరా చేసేందుకు జిల్లా పరిధిలోని స్థానికుల నుండి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ భారతి హొళ్ళికేరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిరాణ, సాధారణ, కూరగాయలు, పాలు, పండ్లు, గ్రుడ్లు, చికెన్, మటన్ కొరకు ఆసక్తి గల అభ్యర్థులు టెండర్ లో పాల్గొనుటకు టెండర్ షెడ్యూల్ ఖరీదు 2 వేల రూపాయలు చెల్లించి జిల్లా మైనార్టీ అధికారి కార్యాలయం నుండి ఈ నెల 3 నుండి 6వ తేదీ సాయంత్రం 4 గంల వరకు (ఆదివారం సెలవు) టెండరు ఫారములు పొందవచ్చని, ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గం౹౹ల వరకు ఇట్టి టెండర్లను సమర్పించవలసి ఉంటుందని, సీల్డ్ టెండర్లకు జిల్లా కలెక్టర్, జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్ చాంబర్ లో ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గం?లకు తెరువడం జరుగుతుందని, కొనుగోలు కమిటీ సమావేశంలో అభ్యర్థులు వస్తువుల యొక్క నమూనాతో యక్తముగా హాజరు కావాలని తెలిపారు. టెండర్లు సమర్పించేందుకు టెండర్ ఫారములో పూర్తి నియమ, నిబంధనలు వర్తిస్తాయని, ఇట్టి టెండరు ఏ కారణం చేతనైనా వాయిదా వేయుటకు, పూర్తిగా రద్దు చేయుటకు జిల్లా కలెక్టర్, జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్ కు పూర్తి అధికారాలు ఉంటాయని, ఈ అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరుగకుండా ముందస్తు చర్యలపై కలెక్టర్ సమావేశం

వికారాబాద్ జిల్లా మార్చ్ 01 ( ప్రజాపాలన ప్రతినిధి ) : వేసవిలో సంభవించే ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరుగకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ పౌసుమి బసు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా నీటి సరఫరా సక్రమంగా అందించాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు పుష్కలంగా ఉన్నందున జిల్లాలోని అన్ని నివాసాలతో పాటు పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్ లకు నీరు అందించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలోని గర్భిణీలు, చిన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎన్ఆర్ఈజిఎస్ కార్మికులు వడదెబ్బ తగలకుండా వారికోసం షామియానాలు, నీటి సదుపాయంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకేట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. వేసవిలో నీటి సరఫరా వాటర్ ట్యాంకులను శుభ్రంగా కడిగి క్లోరినేషన్ చేయాలని, నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రోడ్లపై పిచ్చిగా తిరిగే అనాథలకు ఆశ్రయం కోసం ఒక ప్రత్యేక షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. వెనుకబడిన ప్రాంతాలలో కనీసం వారానికి ఒకసారి మెడికల్ క్యాంపులు నిర్వహించి వడదెబ్బకు గురికాకుండా చూడాలని, అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పశువులు మృత్యు వాత పడకుండా వేసవిలో వాటికి అవసరమైన నీరు, పశు గ్రాసం అందేలా చూడాలని, పశు గ్రాసం కొరత రాకుండా నీటి సదుపాయాలు ఉన్న ప్రాంతాలలో గడ్డి మొక్కలు పెంచాలని తెలిపారు. పశు వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రైతు వేదికల ద్వారా రైతులు వేయవలసిన పంటలు, పశు సంరక్షణ తదితర అంశాలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. విద్యుత్తుకు అంతరాయం, షాట్





సర్క్యూట్ లు జరుగకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 100సం. వయస్సు కల్గిన వ్యక్తికి కోవిడ్ టీకా

శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : మనకోసం , మన కుటుంబం కోసమే కాకుండా ,సామజిక స్పృహ దృష్ట్యా కూడా కోవిడ్ టీకా తీసుకోవడం శ్రేయస్కరమని, టీకా కోసం ఎక్కువ మంది ప్రజలు ఆసక్తిగా వస్తున్నారని చెప్పడానికి ఈ సందర్భం అద్దం పట్టినట్టుగా ఉందని చైర్మన్ %ు% మ్యానేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ అన్నారు. కోవిడ్ నియంత్రణలో భాగంగా 60 సం!! పైబడిన వారికి కోవిడ్ టీకా ఇచ్చే మహత్తర కార్యక్రమానికి నేడు మెడికవర్ హాస్పిటల్స్ వారు శ్రీకారం చుట్టారు. 60 సం!! మొదలుకొని 100 సం!! వయసుకలిగినవారు కూడా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 100 సంవత్సరాల వ్యక్తికూడా కోవిడ్ డోసు తీసుకోవడానికి ముందుకు రావడం గమనార్హం. హైదరాబాద్ నివాసి,మాజీ పారిశ్రామికవేత్త,ఫ్రీడమ్ ఆయిల్స్ సంస్థ యొక్క ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ చౌదరి గారి తండ్రైన శ్రీ జైదేవ్ చౌదరి గారు కూడా ఈరోజు సెక్రటేరియట్ దగ్గర ఉన్న మెడికవర్ హాస్పిటల్ లో కోవిడ్ టీకాను తీసుకున్నారు.ఈయన వయస్సు 100 ఏళ్లు కోవిడ్ టీకా తీసుకొని నాణ్యమైన జీవితాన్ని ఆనందించడానికి తాను




ఎన్నో రోజులుగా ఎదుచూస్తున్నానని, టీకా తీసుకోవడం తనకు అత్యంత సంతృప్తినిచ్చిందని అయన అన్నారు. కోవిడ్ టీకా తీసుకుంటే ఆరోగ్యపరమైన అనర్థాలు ఉంటాయనే తప్పుడు ప్రచారం బయట ఉందనీ, అవన్నీ వట్టి వదంతులే తప్ప నిజాలు కావని అయన అన్నారు.

## జిల్లాలోని రెండు ఆసుపత్రుల్లో అందుబాటులో కొవిడ్ వాక్సిన్

**జిల్లా కలెక్టర్ భారతి హొళ్ళికేరి**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి,మార్చి 1, ప్రజాపాలన :జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మెడిలైఫ్ ప్రైవేట్ ఆసుపత్రిలో కొవిడ్ వ్యాక్సినేషన్ ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ భారతి హొళ్ళికేరి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో వ్యాక్సినేషన్ ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా, మెడి లైఫ్ ప్రైవేట్ ఆస్పత్రిలో వాక్సిన్ రుసుము 150 రూపాయలతో పాటు ఆసుపత్రి సేవా రుసుము 0 నుండి 100 రూపాయల వరకు మొత్తంగా 250 రూపాయలకు మించకుండా వ్యాక్సిన్ అందించడం జరుగుతుందనిపేర్కొన్నారు.ముందుగా రెండు కేటగిరీల వ్యక్తులకు ఈ వ్యాక్సిన్ అందించడం జరుగుతుందనితెలిపారు.60 సంవత్సరాల వయసు పైబడిన వారికి, 45-59 వయస్సు కలిగి మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలతో కలిసి 20 రకాల అనారోగ్య సమస్యలు కలిగి మెడికల్ కౌన్సిల్ లో రిజిస్టర్ అయ్యి వైద్యులచే జారీ చేయబడిన అన్నాక్సుర్ 1 బి సర్టిఫికెట్ కలిగిన వారికి వ్యాక్సిన్ అందించడం



జరుగుతుందని తెలిపారు. రెండు కేటగిరీకి చెందిన వారు ముందుగా ఆన్ లైన్ లో ప్రభుత్వం నిర్దేశించిన వెబ్సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయంలో వినియోగించిన గుర్తింపు కార్డును ఆసుపత్రికి వచ్చేటప్పుడు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. 45- 59 వయసు గలవారు వైద్యులచే జారీ చేయబడిన సర్టిఫికెట్ సైతం తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేయబడిన ఆధార్ కార్డు, ఎలక్షన్ కార్డు, పాన్ కార్డు, ఉద్యోగి గుర్తింపు కార్డు, బ్యాంక్ పాస్ బుక్, డ్రైవింగ్ లైసెన్స్ లను ఫోటో గుర్తింపు కార్డు గా తీసుకొని రావాలని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వాక్సినేషన్ అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యాక్సిన్ రెండు విడతలుగా అందించడం జరుగుతుందని, మొదటి విడత వేసిన 28 రోజుల తరువాత రెండవ విడత వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని, ఇతర వివరాలకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా౹౹ నీరజ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అరవింద్ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనాధ శరణాలయంలో అన్నదానం

శేరిలింగంపల్లి, ప్రజాపాలన : శ్రీ శ్రీ మహంకాళి విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కే కృష్ణమూర్తి చారి సునంద ల 25 వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కే కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమీన్పూర్ లోని మహిమ మినిస్ట్రీస్ అనాధ శరణాలయంలో అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో కే కృష్ణమూర్తి చారి సతీమణి కే సునంద మరియు వారి కుటుంబ సభ్యులు రాజేందర్ చారి, సుజాత, శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కే కృష్ణమూర్తి చారి మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం శ్రేష్టమైనదని ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత వరకు అన్నదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. మనం ఇతరులకు సాయం చేస్తే దేవుడు ఏదో రూపంలో మనకు సాయం చేస్తాడని ఆశాభావం వ్యక్తం



చేశాడు.అనంతరం కృష్ణమూర్తి చారి ఆయన సతీమణి సునంద వారి వివాహ వార్షికోత్సవ వేడుకలు ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు.

## వామన్ రావు దంపతుల హత్య కేసు హైకోర్టు విచారణ

(మొదటి పేజీ తరువాయి)

### వామన్ రావు హత్య కేసులో హైకోర్టులో వాదనలు ఎంతమంది స్టేట్మెంట్ తీసుకున్నారని ప్రశ్నించిన కోర్టు తదుపరి విచారణ ఈనెల 15కు వాయిదా

హత్య కేసులో ఎంత మందిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు? ఎంత మందిని 164 కింద స్టేట్మెంట్ తీసుకున్నారని హైకోర్టు ప్రశ్నించింది. పోలీసు వాళ్ళు క్రిటికల్ స్టేట్మెంట్ ఎందుకు ఇప్పటి వరకు రికార్డు చేయలేదని ప్రశ్నించింది. హైకోర్టు న్యాయమూర్తుల హత్య జరిగిన సమయంలో వాళ్లను అంబులెన్స్లో తీసుకెళ్తున్నప్పుడు వారి స్టేట్మెంట్లను రికార్డ్ చేయవచ్చు కదా అని పోలీసులను ప్రశ్నించింది. ఈ కేసు విషయంలో ఎంతమందిని సెక్షన్ 164 కింద ఇన్వెస్టిగేషన్ చేశారని కోర్టు ప్రశ్నించింది. ఒక మెజిస్ట్రేట్ ని తీసుకువచ్చి వారి ముందు స్టేట్మెంట్ తీసుకోవచ్చు కదా అని కోర్టు అభిప్రాయపడింది.

ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు ఇద్దరు బై స్టాండర్డ్ ని గుర్తించామని ఏజీ కోర్టుకు తెలిపారు. అయితే హత్య జరిగిన సమయంలో అక్కడ ఉన్న రెండు బస్సుల డ్రైవర్లను కూడా సాక్షులుగా గుర్తించామన్నారు. అంతేకాకుండా సీఆర్పీసీ సెక్షన్ 161 కింద వారి స్టేట్ మెంట్ ను కూడా రికార్డు కోర్టుకు ఏజీ తెలియజేశారు. అయితే ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులకు ఎటువంటి రక్షణ కల్పించారని కోర్టు ఏజీని అడిగింది.

హైకోర్టు న్యాయమూర్తుల హత్య జరిగిన ప్రాంతం నుండి పోలీస్ వాళ్లు అక్కడ మొబైల్ ఫోన్స్ ,రక్తపు మరకలను, ఒక మోటార్ బైక్ ని స్వాధీనం చేసుకున్నారని ఏజి కోర్టుకు తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించేందుకు ఇంకా రెండు వారాల సమయం కావాలని ఏజీ కోర్టును కోరారు. దీంతో హైకోర్టు తదుపరి విచారణను మార్చి 15 కి వాయిదా వేసింది..

## ముంబై బ్లాక్అవుట్ వెనుక చైనా.. భారత విద్యుత్ వ్యవస్థపై సైబర్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగమైన చైనా సంస్థలకు చైనా ప్రధాన ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ ఏజెన్సీ అయిన మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ, పీపుల్స్ లిబరేషన్ ఆర్మీతో సంబంధాలు ఉన్నాయి. విద్యుత్ సంస్థలతోపాటు భారత్‌కు చెందిన ఎన్నో ప్రభుత్వ రంగ, రక్షణ సంస్థలు ఈ చైనీస్ సంస్థ రాడార్‌లో ఉన్నట్లు కూడా ఈ అధ్యయనం స్పష్టం చేసింది.

ముంబై అవుటేజ్‌కు ఇదే కారణమా?

గతేడాది అక్టోబర్ 13న ముంబైలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పడ్ఘాలోని లోడ్ డిస్‌ప్యాచ్ సెంటర్‌లో ఓ మాల్‌వేర్‌ను ప్రవేశపెట్టడం వల్లే ఇలా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో మహారాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి నితిన్ రౌత్ కూడా ఈ పవర్ అవుటేజ్ వెనుక కుట్ర దాగి ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం. రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్టాక్ మార్కెట్ మూతపడింది. రైళ్లు రద్దయ్యాయి. ముంబై, థానె, నవీ ముంబైలలో ఆఫీసులు మూతపడ్డాయి.

## వివిధ అభివృద్ధి పనుల మీద ప్రత్యేక శ్రద్ధ.. కలెక్టర్ కు వినతి

బాలాపూర్ : ప్రజాపాలన :మీర్ పేట కార్పొరేషన్ లోని 37 వ డివిజన్ లో పలు అభివృద్ధి పనులు, అదేవిధంగా చెరువులు సుందరీకరణ లో భాగంగా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 37 డివిజన్ కార్పొరేటర్ మోడల్ బాలకృష్ణ,34 వ డివిజన్ కార్పొరేటర్ మన్నెమ్మ తనయుడు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో రెండు డివిజన్లో అభివృద్ధి పనులు జరుగుతూ లేవు....? డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు అదేవిధంగా చుట్టుపక్కల ఉన్న చెరువులు సుందరీకరణ చేయడానికి చాలా సమయం తీసుకుంటున్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఇక్కడున్నా నేతలు పట్టించుకోవడంలేదని మన జయింట్ కలెక్టర్ కు బిజెపి కార్పొరేటర్లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ...... గతంలో భారీ వర్షాల వల్ల వివిధ కాలనీలు పూర్తిగా నీట మునిగి పోయా నెల రోజులు కాలనీలో 10 కోట్లు నష్టం కలిగింది అన్నారు. నీటమునిగిన ఇంటికి పదివేల రూపాయలు, సగం ఇల్లు పడిపోయిన వారికి 50000 రూపాయలు, ఇల్లు పూర్తిగా కోల్పోయిన వారికి లక్ష రూపాయలు ఇచ్చిన మాట నిలబెట్టుకుని టిఆర్ఎస్ పార్టీ, డ్రైనేజీ పనులు, రోడ్డు పనులు, ట్రంక్ లైన్ పనులు ఇక్కడ ఉన్న కాంట్రాక్టర్లు కూడా నత్తనడక నడుస్తున్నాయి అని అన్నారు. చేసే పనులు కూడా నాణ్యత లేవని ప్రజలందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలినీ అదేవిధంగా సంధ చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువు సుందరీకరణ భాగంగా ఆరు ఫిట్నెస్ తొందరలో పనులు పూర్తి కావాలని కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గాజుల మధు, బీ. నరసింహ్మా, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన ప్రతినిధి ) : జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ 152వ బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కె.ఎం.ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. అనంతరం స్వామి వారి రథోత్సవం (జాతర ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్ సింగ్, గ్రామ పెద్దలు గోనే బల్వంత్‌రెడ్డి, పెద్ది మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార సంఘం పాలక వర్గం ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన టీఆర్ఎస్ యువ నేత

కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన ప్రతినిధి ) : జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో సోమవారం జరుగుతున్న మత్స్యకార సంఘం పాలక వర్గం ఎన్నికలకు టీఆర్ఎస్ యువ నాయకులు కె.పి.విశాల్‌గౌడ్ హాజరై ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది

**జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**

కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన ప్రతినిధి ) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు సభ్యత్వ రశీదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.మల్లారెడ్డి, పి.బాలకృష్ణ, విఠల్ ముదిరాజ్, శ్రీనివాస్, సంతోష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కూకట్‌పల్లిలో ట్రస్మా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సర్వ సభ్య సమావేశం

కుత్బుల్లాపూర్, (ప్రజాపాలన ప్రతినిధి ) : కూకట్‌పల్లిలోని హోటల్ అభినందన్ గ్రాండ్‌లో మంగళవారం ట్రస్మా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, ప్రధాన కార్యదర్శి జె.నాగరాజు, కోశాధికారి యండి. అజార్‌ఖాన్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి విశిష్ట అతిథిగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, గౌరవ అతిథిగా ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.మధుసూదన్, కోశాధికారి ఐ.వి. రమణరావులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కోవిడ్ మహమ్మారితో బడ్జెట్ ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. జిల్లాలోని అన్ని బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు పాల్గొని సమస్యలను తెలియజేయాలన్నారు.

# టీడీపీ నేతల అరెస్ట్

**చిత్తూరు మార్చి 1, (ప్రజాపాలన) :** టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులను గృహ నిర్బంధం చేశారు. రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. జిల్లా టీడీపీ నాయకులను అరెస్ట్ చేసి వాహనాల్లో తరలించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చంద్రబాబు చేపట్టిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినా ధర్నాను చేపట్టి తీరుతామని నాయకులు చెబుతున్నారు. ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు పులివర్తి నానీని పోలీసులు అడ్డుకున్నారు.

## విద్యార్థులతో ఆడిపాడిన రాహుల్‌గాంధీ

**చెన్నై, (ప్రజాపాలన ప్రతినిధి :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. తమిళనాడులో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రచార వేగాన్ని పెంచారు. మూడు రోజుల పాటు తమిళనాడు పర్యటనలో భాగంగా.. ర్యాలీలు, సభలతో సందడి చేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రాహుల్‌గాంధీ సరదాగా స్టెప్పులేశారు. తమిళనాడులోని ములగుమూడుబ్స్ సెయింట్ జోసెఫ్స్ మెట్రిక్యులేషన్ విద్యార్థులతో కలిసి ఆడిపాడారు. పుష్-అప్స్, 'ఐకిడో' తో అక్కడి విద్యార్థులతో హుషారుగా గడిపారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అలాగే నాగర్‌కోయిల్ వెళ్లేటప్పుడు ఆచంగులం గ్రామ రహదారి వద్ద ఆగి, తాటి ముంజెలను ఆస్వాదిస్తూ అక్కడి ప్రజలతో ముచ్చటించారు. కాగా, సోమవారం కన్యాకుమారిలో ప్రచారం చేపట్టిన రాహుల్ భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళ ప్రజలు తప్పు మార్గాన తమిళనాడును అభివృద్ధిలో నడపలేరు అని చరిత్ర చెబుతోందని, ఈ ఎన్నికల్లో కూడా ఇదే రుజువు కానుందని అన్నారు. తమిళనాడు ప్రజలకు వాస్తవంగా ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తే ముఖ్యమంత్రి అవుతారంటూ.. స్టాలిన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని చెప్పారు. తమిళనాడు సంస్కృతిని కేంద్రం గౌరవించదని, ముఖ్యమంత్రి ఎడప్పడి పళనిస్వామి ప్రధాని మోదీకి ప్రతినిధి అని విమర్శించారు. ఆయన ఏం చెబితే అదే చేస్తారని, మోడీకి దాసోహం అనేవారు తమిళ ప్రజలకు ప్రాతినిధ్యం వహించలేరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తమిళ సంస్కృతిని ఆర్ఎస్ఎస్ అవమానించే అవకాశాన్ని ముఖ్యమంత్రి ఇవ్వకూడదని అన్నారు.

# తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో చంద్రబాబు పది గంటల నిరసన



**తిరుపతి, ప్రజాపాలన ప్రతినిధి :** మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ఎట్టకేలకు రేణిగుంట విమానాశ్రయంలో ఆందోళన విరమించారు. సాయంత్రం 7.10 గంటలకు విమానంలో ఆయన బయల్దేరి హైదరాబాద్ వెళ్లారు. చంద్రబాబును విమానాశ్రయంలోనే అడ్డుకోవడంతో ఈ ఉదయం నుండి విమానాశ్రయంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన సంగతి తెలిసిందే. సుమారు 10 గంటలపాటు ఆయన నిరసన కొనసాగింది. చంద్రబాబు సోమవారం చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించాలని నిర్ణయించారు. దీంతో ఆయన ఉదయం 9.45 గంటలకు రేణిగుంట చేరుకున్నారు. పుర పాలక ఎన్నికల్లో తమ పార్టీల నేతలను పోటీ చేయనివ్వకుండా అధికార పార్టీల నేతలు అడ్డుకోవడమే కాకుండా దాడులు తెగబడుతున్నారన్న ఆరోపణలపై చంద్రబాబు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. అయితే ఆయన నిరసనకు పోలీసులు నిరాకరించారు. చంద్రబాబును ఎయిర్‌పోర్ట్‌లోనే అడ్డుకున్నారు. అక్కడ నుండి బయటకు రానివ్వలేదు. ఈ నేపథ్యంలో పలు చోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పోలీసుల తీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసుల వైఖరికి నిరసనగా విమానాశ్రయంలో నేలపైనే బైఠాయించారు. ఆందోళన విరమించాలంటూ పలుమార్లు ఉన్నతాధికారులు ఆయనతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. జరిగిన ఘటనపై చిత్తూరు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి వెళ్తానని.. ఎక్కడా ఎలాంటి నిరసన కార్యక్రమాలకు దిగబోనని చెప్పినా పోలీసులు అంగీకరించలేదు. మీడియాతో మాట్లాడేందుకూ అనుమతి చకపోవడంతో చంద్రబాబు నిరసన కొనసాగించారు. మధ్యలో పలు మార్లు తిరుపతి అర్బన్ ఎస్పీ, జెసి ఆయనతో చర్చలు జరిపారు. చివరికి ఆయన నిరసన విరమించి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు.

# గుల్ షద్ బేగం కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం



**పెనమలూరు,ప్రజాపాలన ప్రతినిధి:** పెనమలూరు మండలం కానూరు తులసీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్ వాడీ వర్కర్ గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన గుల్షద్ బేగం కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ ఏ.యండి . ఇంతియాజ్ అన్నారు . స్థానిక ఆటోనగర్ సనత్ నగర్ లో నివశిస్తున్న గుల్ షద్ బేగం కుటుంబాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఏ.యండి. ఇంతియాజ్ పరామర్శించారు. ఆమె గత ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు , మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ఇంతియాజ్ ఆరా తీశారు. లాక్ డౌన్ సమయం నుంచి ఆమె సన్నబడుతున్నదని వివరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుల్షద్ బేగం మరణం భాధాకరమన్నారు. ఇటీవల కరోనా వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకోవడం కూడా జరిగిందన్నారు. ఆమె మరణానికి కారణాలను వైద్యులు నిర్ధారించవలసి ఉందన్నారు. ఆమె మరణం దురదృష్టకరమైనప్పటికి ఆమె కుటుంబాన్ని మహిళ శిశు సంక్షేమ శాఖ, ప్రభుత్వం తరుపున అన్ని విధాల అదుకుంటామన్నారు . కలెక్టర్ వెంట పెనమలూరు తహశీల్దార్ బద్రు నాయక్ ,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఉన్నారు .

## ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రుక్మాంగదయ్య



**జగ్గయ్యపేట, మార్చ్ 1 (ప్రజాపాలన) :** జగ్గయ్యపేట పట్ట ణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా ని ర్మిస్తున్న ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను కృష్ణాజి ల్లా గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రు క్మాంగదయ్య సోమవారం సందర్శించారు. ఈ సం దర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసన సభ్యులు సామినేని ఉదయభానుతో కలసి ఎస్టీ బా లుర గురుకుల పాఠశాల పనులను పరిశీలించారు. అనంతరం జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు అవ్వడం జరిగిందని, వాటికి సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రుక్మాంగదయ్యకి అం దజే శారు. అదేవిధంగా ఎస్టీ గురుకుల పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు.

# మేయర్ పీఠం కైవసం చేసుకుంటాం - నగర అధ్యక్షుడు బొప్పన

**– వైసీపీ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు**

**–మూడు రాజధానులకు కృష్ణా, గుంటూరు ఫలితాలే కొలమానం**




**విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి:** కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక డివిజన్ లో విజయం సాధించి మేయర్ పీఠం కైవసం చేసుకుంటామని వైసీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ స్పష్టం చేశారు. సోమవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఏ ఊరు వెళ్లినా వైసీపీ నేతలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. పార్టీలు, కులాలు,మతాలు, ప్రాంతాలతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. నవరత్నాల వల్ల రాష్ట్రంలో వైసీపీ మరింత బలోపేతం అయ్యిందన్నారు. 2022 కల్లా పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని పట్టుదలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నారని తెలిపారు. ప్రారంభించి వదిలేయడం చంద్రబాబు నైజం అయితే...పని మొదలు పెడితే పూర్తి చేసేవరకు పట్టు వదలని వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. విజయవాడ నగర అభివృద్ధి కి ఇప్పటికే దాదాపు రూ.500 కోట్లు విడుదల చేశారని తెలిపారు. కృష్ణలంక రీటైనింగ్ వాల్ నిర్మాణం,రోడ్లు,డ్రైనేజి పనులు ప్రారంభించి చాలా వరకు పూర్తి చేశారని,ఎన్నికలు పూర్తి కాగానే మిగిలిన పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు నష్టపోతున్నారనడం సరికాదని,రాష్ట్ర సమగ్రాభివృద్ధికే మూడు రాజధానులను ఏర్పాటు అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. అన్ని ప్రాంతాల వారు స్వాగతిస్తున్నారని అందుకు కృష్ణా,గుంటూరు జిల్లాల పంచాయతీ ఫలితాలే కొలమానం అన్నారు.విజయవాడలో 55కి పైగా సీట్లు గెలుచుకుంటామని, ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబించేలా ఫలితాలు ఉండబోతున్నాయని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఐ జేయు ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు, ఏపీ యూ డబ్ల్యూ జె అర్బన్ అధ్యక్ష,కార్యదర్శి లు చావా రవి,కొండా రాజేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన ఈ ఎస్ సి ఐ రెసిడెంట్ ఇంజనీర్ పి.రుద్రమూర్తి



హైదరాబాద్,ప్రజాపాలన (ప్రతినిధి):గచ్చిబౌలి లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా లో గత 33 ఏళ్లుగా పనిచేస్తున్న రెసిడెంట్ ఇంజనీర్ పి.రుద్రమూర్తి ఈ రోజు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయన ను సన్మానించారు. సంస్థయొక్క సివిల్ వర్క్ లన్నింటిలో ఆయన ప్రతిభ కనిపిస్తుందని,సంస్థలోని ప్రతీ బిల్డింగ్ ఆయన ఆధ్వర్యంలో కట్టినవే.ఆయన సివిల్ వర్కులలో మాత్రమే కాదు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుటలో కూడా అందెవేసిన చెయ్యి అని పలువురు ప్రశంసించారు. ప్రతీ యేటా జనవరి 26,ఆగస్టు 15 జాతీయ దినోత్సవాలలో ఆయన ఆటా పాటా లేకుండా జరిగేవి కావని గుర్తుచేసుకున్నారు.ఈ విషయం లో ఆయనకు తోడుగా మాధవరావు నిలిచేవారు. ఈ కార్యక్రమంలో ఈ ఎన్ సి ఐ డైరెక్టర్ డాక్టర్.జి.రామేశ్వరరావు పాల్గొని రుద్రమూర్తిని ఘనంగా సన్మానించారు. ఆయన పదవీ విరమణ చేసినా కూడా భవిష్యత్తులో ఆయన సేవలు సంస్థకు అవసరం అని డైరెక్టర్ డాక్టర్.జి.రామేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.జి.రామేశ్వరరావు తో పాటు శ్రీ %హూ% చంద్ర మోహన్ , శ్రీ జగదీష్, నాగేశ్వర రావు,హూ హూవిద్య సాగర్, రాజ శేఖర్,హూ %జుూజ×% స్టాఫ్‌హూ నాగమెల్లేశ్వర రావు, సుధాకర్, నాగేశ్వర రావు, నరసింహ, విశ్రాంత ఉద్యోగి %ూ=హూ% మాధవరావు తదితరులు పాల్గొన్నారు.





# ఆ రోజు మమ్మల్ని ఆపినప్పుడు ప్రజాస్వామ్యం ఏమైంది?



**తాడేపల్లి, ప్రజాపాలన ప్రతినిధి :** ఓటమిని జీర్ణించుకోలేకే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు డ్రామాలు చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే అంబటి రాంబాబు మండిపడ్డారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని చంద్రబాబుకు తెలీదా అని ప్రశ్నించారు. నిరసనకు అనుమతి లేదని నిన్ననే పోలీసులు నోటీసులు ఇచ్చారని, చంద్రబాబు నాయుడిపై టీడీపీ కార్యకర్తలకు విశ్వాసం పోయిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీకి అభ్యర్థులు లేరని ఎద్దేవా చేశారు. తమను విశాఖ ఎయిర్‌పోర్టులో ఆపినప్పుడు ప్రజాస్వామ్యం ఏమైందని మండిపడ్డారు. ఈరోజు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునే చంద్రబాబును ఆపారని తెలిపారు. చంద్రబాబు డ్రామాలు ఇకపై సాగవన్నారు. చంద్రబాబు ఉదయం నుంచి రేణిగుంటలో ఒక హై డ్రామా నడుపుతున్నారని, బాబు ఓటమిని అంత తేలిగ్గా అంగీకరించేవారు కాదని ధ్వజమెత్తారు. పంచాయతీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోయారని, చిత్తూరు జిల్లాలో ఏదో అన్యాయం జరిగిందని నిరసన చేస్తానని వెళ్లారని మండిపడ్డారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తికి ఎన్నికల కోడ్, కోవిడ్ నిబంధనలు తెలియవా అని ప్రశ్నించారు. వెళ్లాలనుకుంటే ఎన్నికల కమిషన్ వద్ద అనుమతి తీసుకోవాల్సిందని, అనుమతి తీసుకోవడానికి ఎందుకు ప్రయత్నం చేయలేదని విమర్శించారు. పోలీసులు దండం పెట్టి చెప్పినా వినకపోవడం ఏమిటమని ధ్వజమెత్తారు.

# ప్రజాపాలన

## సంపాదకీయం

మంగళవారం 02, మార్చి 2021

# మానవుడే... మహనీయుడు!

నిత్యజీవితంలో మనిషికి అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. ఏదీ మనం కోరుకున్న విధంగా సాగదు. మనకు నచ్చిన విధంగా అన్నిటికీ పరిష్కారాలు దొరకవు. అలాగని ప్రతిదానికీ సర్దుకుపోవడం, లొంగిపోవడం మానవనైజం కాదు. మనిషి సహజ ప్రవృత్తి అదికాదు. కొంతమంది ఆధ్యాత్మికవాదులు... నిన్ను నువ్వు తగ్గించుకోవాలి... సర్దుకుపోయి జీవించాలి అని చెబుతుంటారు. కుటుంబంలోనో, రోజువారీ జీవితంలోనో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలకు సర్దుకుపోవచ్చు. అలా సర్దుకుపోయినప్పుడే మన బంధాలు నిలుస్తాయి కూడా. కానీ మనం కష్టపడి సంపదను సృష్టిస్తే... ఏ కష్టమూ లేకుండా ఆ సంపదను సునాయాసంగా దోచుకుపోతుంటే అప్పుడూ సర్దుకుపోవాలా? పోతేపోయిందిలే అని ఊరుకోవాలా? తామరాకు మీద నీటి బొట్టులా వుండాలి.... ఏ కష్టానికీ చలించకూడదు.... స్థితప్రజ్ఞతతో వుండాలని అనుకుంటూ... కళ్ళెదుటే దేశసంపదను కొల్లగొడుతుంటే... మౌనంగా ఊరుకోవాలా? సర్దుకుపోవడమే సహజలక్షణం అని, సర్దుకుపోయేవారు తెలివైన వారని భావించేవారు మనలో ఎక్కువే. వీరిలానే సుమతీ శతక కారుడు కూడా 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి' అంటూ గోడమీది పిల్లివాటంనే ప్రదర్శించాడు. అయితే, పరిస్థితులేవైనా.... కళ్ళముందు జరుగుతున్న దారుణాన్ని ప్రశ్నించేవారు, ఎదిరించేవారు... దానిపై పోరాడేవారే నిజమైన మానవ సహజ ప్రవృత్తిగలవారు.మానవజాతి సహజలక్షణం పోరాడి పరిస్థితులను మార్చడం. మానవ సమాజం ప్రారంభంలో నాటి మనిషి సర్దుకుపోయి వుంటే, ఇవాళ అనంతమైన సముద్రంపైకి పోగలిగేవారం కాదు. గాల్లోకి ఎగరలేమని రైట్‌బ్రదర్స్ సర్దుకుపోయి వుంటే... ఇవాళ విమానాల్లో విహరించగలిగేవారమా? చీకటితోనే సర్దుకుపోయివుంటే, రాళ్లతోనే నిప్పు రాజేసుకుంటూ వుంటే... విద్యుత్ వచ్చేదా? ఇటీవలే మార్స్‌పైకి రోవర్‌ను సైతం పంపగలిగాం. 'గ్రహరాసులనధిగమించి ఘనతారల పథము నుంచి/ గగనాంతర రోదసిలో గంధర్వగోళగతుల దాటి/ చెంద్రలోకమైన దేవేంద్రలోకమైన బొందితో జయించి మరల భువికి తిరిగిరాగలిగే/ మానవుడే మహనీయుడు' అంటాడు ఆరుద్ర. మానవ మనుగడకు సంబంధించి ప్రధాన సవాళ్లు ఎదురైనప్పుడు సర్దుకుపోయే తత్వాన్ని వదిలి... పట్టుదలతో ఎదిరించిపోరాడటం ద్వారా పరిస్థితులను తనకు అనుకులంగా మార్చుకున్నప్పుడే మానవుడు పురోభివృద్ధి చెందుతాడు.కరోనా కష్టకాలంలో దాన్ని నియంత్రించడానికి ప్రపంచవ్యాప్తంగా అనేక విధాలుగా పోరాడి... చివరకు వ్యాక్సిన్ కనుగొన్నారు. ఈ వ్యాక్సిన్‌ను అందరికీ ఎలా అందించాలా అని ఒక యుద్ధమే చేస్తున్నారు. అంతేగాని దాన్ని వదిలేసి అడవుల్లోకో బంకర్లలోకో పారిపోలేదు. ఒకప్పుడు పేదరికంతో మగ్గిపోయిన చైనా... నేడు పేదరికానికి కూడా వ్యాక్సిన్ కొనుగొన్నది. పేదరికంపై పోరాడి జయించింది. అసలు పోరాటమే దండగ అనేవారు... ఇప్పుడు కరోనాపై ఎందుకు పోరాటం చేస్తున్నారు. ఏ పొరుగు దేశమైనా మన దేశంపై దాడిచేస్తే.. పోరాడుతున్నాం తప్ప ఎందుకు సర్దుకుపోవడంలేదు..? ఎందుకంటే... ప్రతికూలతపై పోరాటం మానవ ప్రవృత్తి గనుక. రాష్ట్రానికే మణిహారం వంటి విశాఖ ఉక్కును కేంద్రం ప్రైవేటు కార్పొరేట్లకు అమ్మేస్తుంటే... సర్దుకుపోదాంలే అని ముఖ్యమంత్రి అనుకుంటే, ఆయన వరకు బాగానే వుండొచ్చునేమో.... కానీ రాష్ట్రప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంది. కనుక మన హక్కుల రక్షణ కోసం పోరాడాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది.కేవలం ఐదారుగురు కార్పొరేట్లకోసం 130కోట్ల మందిని సర్దుకుపొమ్మని సాక్షాత్తూ ప్రధానమంత్రే చెబుతున్నారు. అప్పుడు కూడా కనీసం ప్రశ్నించలేని పరిస్థితిలో మన ముంటే... 'మనదీ ఒక బ్రతుకేనా కుక్కలవలె నక్కల వలె...' అని మహాకవి శ్రీశ్రీ అన్నట్టుగా... మనదీ ఒక బతుకేనా..? మానవుడిలో స్వతహాగా వుండే లక్షణం... కష్టాలను అధిగమించేందుకు సాగించే పోరాటం. అవదులు లేని చైతన్యపరిధి పోరాటం. గాంధీ మహాత్ముడైనా... మనిషి మహనీయుడైనా పోరాటం వల్లనే సాధ్యం. అన్యాయాలు జరుగుతున్నా సర్దుకుపోవాలనే లక్షణాన్ని పక్కన పెట్టి... అంతర్లీనంగా వున్న మహనీయతను వ్యక్తం చేసే పోరాట లక్షణాన్ని ముందుకు తెద్దాం.

## కనుకొనల్లోంచి రెండు కవితలు

అమ్మా నాన్న
అతడు సంసారంపట్ల విరక్తి చెందినపుడు
ఇల్లొదిలి
ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోతే బాగుండు
అనుకునేవాడు
ఆమె కూడా
అలాంటి విరక్తే కలిగినపుడు
ఇల్లొదిలి
ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోతే బాగుండు
అనుకునేది
కానీ నిద్రలో
అమ్మ పొట్టమీద కాలువేసి
పసిబాలుడు-
నాన్న బొజ్జమీద కాలువేసి
పసిబాలిక-
ఆ తల్లిదండ్రులిద్దరికీ
ఇల్లొదిలి
దూ... రం... గా
వెళ్లిపోతున్న కలను కూడా
కనీసం రానిచ్చేవాళ్లు కాదు
అమ్మా నానీ
చాలా రోజుల తర్వాత అతడికి
మరణించిన వాళ్లమ్మ
కలలో కనిపించింది
ఆరోగ్యంగా... సంతోషంగా...
కాంతివంతంగా...
అంతులేని దయతో
అతడి తలను ప్రేమగా నిమురుతూ
'ఎలా ఉన్నావు నానీ'
అని అడిగింది
'మనసేం బాగుండడం లేదమ్మా'
అన్నాడతను అన్నీ తల్చుకొని
బోరున విలపిస్తూ-
పసిపిల్లాడిలా
తల్లి ఒడిలోకి చేరుతూ.
ఆమె కూడా
కొడుకు దుఃఖాన్ని చూడలేక
నిశ్శబ్దంగా కన్నీళ్లు కార్చింది.
తెల్లారి నిద్రనుండి మేల్కొన్న అతడు
'అరె!
ఆ కాంతిలోకంలోనైనా
ఎంతో సంతోషంగా ఉన్న
మా అమ్మ కళ్లను
నీళ్లకు గురిచేసాను'
అని పశ్చాత్తాపపడి
'ఇక మీద అలా జరక్కూడదు'
అని నిశ్చయించుకొని
కాంతిలోకంలో
తనుకానీ తన తల్లికానీ
ఇంకెప్పుడూ
కన్నీళ్లు పెట్టని రీతిలోకి
హృదయాన్ని మలుచుకునే
పనిలో పడ్డాడు.

....మ

# సమాంతర ప్రైవేటు డిస్కాములు



మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలనీ విద్యుత్ చట్ట సవరణ ప్రతిపాదన విరమించుకోవాలంటూ దేశవ్యాప్తంగా రైతులు దాదాపు మూడు మాసాలుగా ఉద్యమిస్తున్నారు. రైతు ఉద్యమ ధాటికి వెనక్కి తగ్గిన ప్రభుత్వం విద్యుత్ చట్ట సవరణలతో బిల్లు తీసుకురావాలన్న ప్రతిపాదనను విరమించుకుంటామని, మూడు చట్టాల అమలును ఏడాదిన్నర పాటు నిలుపుదల చేస్తామని రైతు సంఘాల నేతలతో జరిగిన పదవ దఫా చర్చల్లో చెప్పింది. కాని, మరోవైపున విద్యుత్ చట్ట సవరణలను తీసుకు రావడానికి ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. ఫిబ్రవరి 17న రాష్ట్రాల విద్యుత్ శాఖ కార్యదర్శులతో కేంద్ర మంత్రి ఆర్‌కె సింగ్ ఈ విషయంపై చర్చించడం మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన మాటమీద నిలబడదని చెప్పడానికో దృష్టాంతం. ప్రతిపాదిత విద్యుత్ సవరణ బిల్లులోని కొన్ని అంశాలు, ఆనాటి సమావేశంలో వ్యక్తమైన వివిధ అభిప్రాయాలనుగురించి చర్చిద్దాం.

### ప్రైవేటుకు పెద్ద పీట

ప్రతిపాదిత విద్యుత్ సవరణ బిల్లు ప్రధానంగా ప్రైవేటు డిస్కాములకు నిర్నిబంధమైన స్వేచ్ఛనివ్వడం, జాతీయ గ్రిడ్‌కు సర్వాధికారాలు కట్టబెట్టడంపై కేంద్రీకరించింది. గతంలో తెచ్చిన 2003 విద్యుత్ చట్టం ప్రధానంగా విద్యుదుత్పత్తి రంగంలో ప్రైవేటుకు పెద్ద పీట వేయడం, విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ల ఏర్పాటు, వాటి అధికారాలు తదితర అంశాలపై దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ప్రపంచబ్యాంకు సంస్కరణలను ముందుకు తీసుకుపోవడానికి ఆనాటి చట్టం ఉద్దేశించబడింది. ఇప్పుడు పంపిణీ రంగంలో ప్రైవేటు శక్తుల చొరబాటుకు, సంప్రదాయేతర విద్యుదుత్పత్తి రంగంలోని కార్పొరేట్లకు మేలు చేయడానికి, తద్వారా విద్యుత్ సంస్కరణల్ని మరింత గట్టిగా అమలు చేసేందుకే కొత్త సవరణ బిల్లు తెస్తున్నారు. ఇప్పటివరకు ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రదేశంలో విద్యుత్ పంపిణీ చేసేందుకు ఒక డిస్కాముకు మాత్రమే రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఇఆర్‌సి) లైసెన్స్ మంజూరు చేసేది. ఇకపై డిస్కాములు ఇఆర్‌సి వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుంది. రెండు అంతకన్నా ఎక్కువ డిస్కాములు కూడా నమోదు చేసుకోవచ్చు. అలాగే ఎవరైనా ఒక వ్యక్తి ఆ డిస్కాం నుండి విద్యుత్ తీసుకొని, తిరిగి అమ్ముకున్నా వారు ప్రత్యేకించి రిజిస్ట్రేషన్ చేయించుకోనవసరం లేదట. ఇంకా విచిత్రం ఏమిటంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా విద్యుదుత్పత్తి చేసి, అక్కడే అమ్ముకుంటే వారు రిజిస్ట్రేషన్ కూడా చేయించనక్కరలేదట. దరఖాస్తు అన్ని విధాలా సవ్యంగా ఉంటే అది అందిన 60 రోజుల్లోగా ఆ డిస్కాంను నమోదు చేయవలసిన బాధ్యత ఇఆర్‌సిదేనని పేర్కొన్నారు. అంతేగాక 60 రోజుల్లోగా ఇఆర్‌సి నుండి ఏ సమాచారం రాకపోతే ఆ డిస్కాం నమోదు అయిపోయినట్టేనని (డీమ్డ్ టు బి రిజిస్టర్డ్) పేర్కొన్నారు.

### బిఎస్‌ఎన్‌ఎల్‌ను జియో మింగేసినట్టు...

ఏదైనా డిస్కాం ఒక ప్రాంతంలో తన నెట్‌వర్క్‌తోగాని, అప్పటికే ఉన్న మరొక డిస్కాం నెట్‌వర్క్‌ను గానీ ఉపయోగించుకొని వినియోగదార్లకు విద్యుత్ సరఫరా చేయవచ్చునని సవరణ బిల్లు పేర్కొంది. అంటే ఇప్పుడున్న ప్రభుత్వ రంగ డిస్కాముల మౌలిక వసతులను, నెట్‌వర్క్‌ను వాడుకొంటూ ప్రైవేటు డిస్కాం సమాంతరంగా విద్యుత్ అమ్ముకుంటుందన్నమాట. దీంతో నగరాలు, వాణిజ్యం, సంపన్నులు నివసించే ప్రాంతాలు వారు తీసుకొని గ్రామాలు, వ్యవసాయం వంటివి ప్రభుత్వ డిస్కాములకు వదిలేస్తారు. అలాగే అప్పటికే ఆ ప్రదేశంలో సేవలందిస్తున్న డిస్కాంకు కేటాయించిన విద్యుత్‌లో కొత్తగా నమోదైన డిస్కాముకు ఇఆర్‌సి నిర్ణయించిన వాటా ఇవ్వాలి. అయితే, ప్రైవేటు డిస్కాం కొత్తగా చేసుకున్న కొనుగోలు ఒప్పందాల్లో పాత డిస్కాముకు వాటా ఇవ్వనక్కరలేదు. నయా ఉదారవాద ఆర్థిక విధానాల సమర్ధకులు చెప్పే 'అందరికీ సమానావకాశాలు (లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్)' అన్న నియమం అటకెక్కిపోయిందన్నమాట. ఇందులో ఒక ఘరానా మోసం దాగివుంది. ఇప్పటికేవున్న ప్రభుత్వ డిస్కాములకు కేటాయించిన విద్యుత్‌లో ప్రైవేటువారు వాటా పొందే హక్కుంది కనుక వెంటనే ఆ విద్యుత్‌తో తమ వ్యాపారం ప్రారంభించవచ్చు. సౌర, పవన వంటి సంప్రదాయేతర వనరుల నుండి చౌకగా విద్యుత్ లభిస్తోంది. అలాంటి వాటితో ఒప్పందం చేసుకొని, దాంట్లో ప్రభుత్వ డిస్కాముకు వాటా ఇవ్వకుండా పాత (అధిక) ధరకు ప్రైవేటు డిస్కాం వినియోగదార్లకు అమ్ముకొని విపరీత లాభాలు గడిస్తుంది. లేదా కొన్నాళ్లపాటు ప్రభుత్వ డిస్కాం కంటె చౌకగా కూడా సరఫరా చేసి, ఆ వినియోగదారులందరినీ ఆకర్షిస్తుంది. దాంతో విపరీత నష్టాల పాలై ప్రభుత్వ డిస్కాం మూతకు దారి తీయవచ్చు (జియో-బిఎస్‌ఎన్‌ఎల్ అనుభవం అందరికీ తెలిసిందే కదా!).

### రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్లు, ఇఆర్‌సిలపైనా..

ఇప్పటివరకూ జాతీయ పవర్ గ్రిడ్ అనుసంధానంతో ఆయా రాష్ట్రాల్లోని లోడ్ డిస్పాచ్ సెంటర్లు (ఎస్‌ఎల్‌డిసి) వివిధ డిస్కాముల పరిధిలోని ఫీడర్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో నిర్ణయాధికారం ఎస్‌ఎల్‌డిసి లదే. ఇకపై జాతీయ పవర్ గ్రిడ్‌కు నిర్నిబంధమైన అధికారాలు దఖలు పరుస్తారు. ఆయా డిస్కాములకు విద్యుత్ సరఫరా ఇకపై పూర్తిగా జాతీయ గ్రిడ్ నిర్ణయిస్తుంది. ఆయా ప్రైవేటు విద్యుదుత్పత్తి సంస్థలకు బకాయి పడ్డ డిస్కాములకు విద్యుత్ సరఫరా ఆపేసే అధికారం జాతీయ గ్రిడ్‌దేనని చెబుతూ కేంద్ర ప్రభుత్వం గత ఏడాది రాష్ట్రాలను ఇబ్బంది పెట్టిన విషయం చాలామందికి గుర్తుండే వుంటుంది. ఇప్పుడు దాన్ని చట్టబద్ధం చేయబోతున్నారు. ఇఆర్‌సిల ఛైర్‌పర్సన్లు, సభ్యులను కేంద్ర ప్రభుత్వమే నియమించాలంటూ 2020 సవరణ బిల్లులో ప్రతిపాదిస్తే దాన్ని అన్ని రాష్ట్రాలూ వ్యతిరేకించాయి. తాజా సవరణల్లో నియమించే అధికారం రాష్ట్రాలకే ఉంచినా ఎలాంటి వారిని, ఎంతమందిని నియమించాలన్న అంశాలను పేర్కొన్నారు. ఇఆర్‌సిలు అనుసరించాల్సిన విధి విధానాలను కేంద్రమే రూపొందిస్తుందట! మరిన్ని నష్టకరమైన అంశాలు కూడా ఉన్నాయి.

### రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా..

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న యత్నాలను వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. అన్ని రాష్ట్రాల విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫిబ్రవరి 17న కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలతో పాటు బిజెపి పాలించే రాష్ట్రాలు కూడా వ్యతిరేకించాయి. భౌగోళిక కారణాల వల్ల ప్రైవేటీకరణ సాధ్యం కాదని హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, లడక్ అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఫ్రాంఛైజీ వ్యవస్థను అమలు చేయడాన్ని తెలంగాణ ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటైన పంపిణీ వ్యవస్థపై ప్రైవేట్ గుత్తాధిపత్యం ఏమిటని ఎపి తో పాటు కేరళ, తమిళనాడు అధికారులు వ్యతిరేకించారు. ఆదాయం ఎక్కువ ఉన్న ప్రాంతాలను ప్రైవేట్‌కు అప్పగిస్తారని, దీనివల్ల తాము నష్టపోతామన్నారు. ఉద్యోగుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తమకు పోటీగా ప్రైవేటు డిస్కాములను ఏర్పాటు చేసే ప్రతిపాదన్కట ఇంకొన్ని రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేసినా కేంద్ర మంత్రి వినిపించుకోలేదు. పైపెచ్చు వినియోగదారుడికి డిస్కాంలను ఎంపిక చేసుకునే అవకాశం ఇవ్వడానికి మీరు వ్యతిరేకమా అంటూ రాష్ట్రాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం దారుణం. టెలికాం సెక్టార్ ప్రైవేట్ పరం చేసినట్టే విద్యుత్ రంగం ప్రైవేటీకరణ వల్ల వినియోగదారులకు మేలు జరుగుతుందని, ప్రైవేట్ కంపెనీలకు అవసరమైన నెట్‌వర్క్, లైన్లు అంతా కూడా డిస్కాముల నుంచే వాడుకుంటాయని గట్టిగా చెప్పారట. ఇందుకు కొంత నగదు ప్రైవేట్ కంపెనీలు డిస్కాంలకు చెల్లిస్తాయని ఊరడించడం ఘోరం. ఉద్యోగులు, క్రాస్ సబ్సిడీ వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వాలు లేవనెత్తిన వాటికి మంత్రి సరైన సమాధానం చెప్పలేదు.

### అంతా ఏకపక్షం

ఈ బిల్లు రూపొందించే సమయంలో కేంద్ర ప్రభుత్వం వినియోగదారులు, విద్యుత్ రంగ నిపుణులు, ఇంజినీర్లు, ఉద్యోగులను విస్మరించింది. వారి స్పందనలు తీసుకునేందుకు ఈ బిల్లును కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని డిమాండ్ చేస్తున్నా అది అరణ్య రోదనగానే మిగిలిపోతోంది. డిస్కామ్‌లకు పోటీగా ప్రైవేటీకరణ సమాంతర లైసెన్స్ తీసుకురావడం వల్ల ఆశించిన ఫలితాలకు విరుద్ధంగా జరిగినట్లు పూణెకు చెందిన ప్రముఖ సంస్థ 'ప్రయాస్ గ్రూప్' అధ్యయనం స్పష్టం చేసింది. ఈ విధానం వల్ల వినియోగదారులపై అధిక భారాలు పడ్డాయని, నియంత్రణ వైఫల్యం చెందిందని, అనవసరమైన ఇబ్బందులు వచ్చాయని వెల్లడించింది. ఒడిశా, ఢిల్లీలో ఇలానే జరగడంతో ఆ రాష్ట్రాలు వ్యతిరేకించాయి. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ అధికారులు వ్యతిరేకించినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వైఖరి తీసుకుంటుందన్నది ఇంకా స్పష్టం కావడంలేదు. వైసిపి అధికారానికి వచ్చీ రాగానే పిపిఎలను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి గట్టిగా చెప్పినా ఆ తరువాత వెనక్కు తగ్గారు. గతంలో ఇఆర్‌సి నియామకం వంటి అంశాల్లో కేంద్ర ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకించినా, జాతీయ గ్రిడ్ పెత్తనాన్ని అంతగా ప్రతిఘటించలేదు. డిస్కాముల మౌలిక వసతులను, నెట్‌వర్క్‌ను ప్రైవేటువారు సమాంతరంగా వాడుకోవాలన్న అంశాన్ని ఉద్యోగుల మొదలు ఉన్నతాధికారుల వరకూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విద్యుత్ రంగానికి తీవ్ర హానికరమైన కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనల్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఘటించాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి.

# శభాష్ మేఘన.... రైఫిల్ షూటింగ్ లో టాప్





హైదరాబాద్ 1 మార్చి (ప్రజాపాలన ప్రతినిధి) :హైదరాబాద్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ శాంపియన్ షిప్ పోటీల్లో సాదుల మేఘన నాలుగు పతకాలు సాధించి నేటితరం ఔత్సాహిక క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచింది.హైద్రాబాద్ లోని నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో పన్నెండో స్టాండర్డ్ చదువుతున్న విద్యార్థిని మేఘన ప్రతిష్టాత్మకంగా జరిగిన రైఫిల్ షూటింగ్ లో పాల్గొని అత్యంత ప్రతిభను ప్రదర్శించింది.ఛాంపియన్ షిప్ పోటీల్లో నాలుగు మెడల్స్ సాదించించిన చిన్నారి మేఘనకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తో పాటు రాష్టం లోని ఇతర పాఠశాల విద్యార్థులు ప్రశంశిస్తున్నారు.చిన్న వయసు నుంచే రైఫిల్ షూటింగ్ పై మక్కువ తో సాధన చేస్తూ నేడు రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించింది.ఛాంపియన్ షిప్ పోటీల్లోని పలు అంశాల్లో పాల్గొన్న మేఘన స్వర్ణ పథకం తోపాటు వివిద పథకాలను సొంతం చేసుకోవడం పట్ల ఉమ్మడి.వరంగల్. ఖమ్మం జిల్లాల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేసారు.మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సికింద్రాబాద్ రైల్వే డీసీపీ సాదుల సారంగపాణి తనయ మేఘన కావటం విశేషం తెలంగాణ రైఫిల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మేఘన నాలుగు మెడల్స్ సాధించటంపట్ల డీసీపీ హర్షం వ్యక్తం చేసారు.విద్యతోపాటు ప్రతి విద్యార్థి క్రీడలను అలవర్చుకోవలని కోరారు.మానసిక ఉల్లాసం.ఉత్సంతో పాటు విద్యార్థుల్లో మనోధైర్యం పేరుగుతుందన్నారు..

క్లిష్ట పరిస్థితుల్లో......

ప్రస్తుతం అన్నివర్గల ప్రజలు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారని.ఇటువంటి తరుణంలో రైఫిల్ షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించటం సహసోపేతమని గొప్ప తెలంగాణ రైఫిల్ అసోసియేషన్(టి ఆర్ ఎ)

అధ్యక్షుడు అమిత్ సాంఘి కొనియాడారు. హైదరాబాద్ సెంటర్ యూనివర్సిటీ(హెచ్ సి యు) లోని రైఫిల్ రేంజ్ లో నిర్వహించిన ఛాంపియన్ షిప్ ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంఘి మాట్లాడుతు అయిదు రోజుల పాటు నిర్వహించిన పోటీలను కోవిడ్ నిబంధనల కు లోబడి ఆధ్యంతం అబ్బురపరిచేలా నిర్వహించారన్నారు. ఏడవ తెలంగాణ షూటింగ్ ఛాంపియన్ షిప్ ను విజయవంతం గా నిర్వహించారని కోవిడ్19 క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మొదటి సారి గా ఎలక్ట్రానిక్ టార్గెట్ లను ఉపయోగించటం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. జట్లు,అధికారులు, షూటర్లు సాధించిన విజయాలను క్రీడా పోటీలలో బోర్డ్ సభ్యులు నిబద్ధతను ఆయన కొనియాడారు. పదిమీటర్ల ఎయిర్ రైఫిల్ ఎయిర్ పిస్టల్ 25 మీటర్ల పిస్టల్ వంటి అన్ని ఈవెంట్లలో పాల్గొని విజయకేతనం ఎగురవేశరన్నారు.ఈ కార్యక్రమంలో సబీర్ అలీఖాన్, మహ్మద్ వాజీద్ ఖాన్, మహ్మద్ ముస్తాప ఖాన్, కిరణ్, రాజకుమార్ వసీనుందర్ నాలి,శ్రవణ్ కుమార్, మహ్మద్ ఆసన్ షరీఫ్,స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ బాద్యులు గగన్ నారంగ్ ఆధ్వర్యంలో



గన్ ఫర్ గ్లోరీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం కావాలి...

ప్రతి విద్యార్థినిలో ఆత్మస్థాయిర్యం ఉండాలని

సాదుల మేఘన అన్నారు.రైఫిల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నాలుగు పథకాలు సాధించి అందరి ప్రశంశలు అందుకొన్న మేఘన ప్రజాపాలన ప్రతినిధితో మాట్లాడుతూ షూటింగ్ స్పోర్ట్స్ మహిళలు,బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందింప జేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను అధిగమించి ముందుకు సాగేందుకు కరాటే,జిమ్నాస్టిక్ తరహా పోటీలు నిర్వహించటం చాలా మంచిదన్నారు. తన తల్లిదండ్రులు ప్రోత్సాహించడం తోనే రాణిస్తున్ననని మేఘన తెలిపారు. ఆమె తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కు తన విజయానికి కృషి చేసిన కోచ్ లు ప్రసన్న,మాలబిక లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 5 వ తేదీ నుండి 7 వ తేదీ వరకు జనగామ జిల్లా కేంద్రంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

## లక్ష్మయ్యకు టిఆర్ఎస్ నాయకుల నివాళి



వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రానికి చెందిన కూర లక్ష్మయ్య ఆదివారం మృతి చెందడంతో సోమవారం స్థానిక టిఆర్ఎస్ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి లక్ష్మయ్యకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఐటీపాముల సత్యనారాయణ,ఎమ్మె లింగస్వామి,సోమనబోయిన రమేష్,పోలేపాక బిక్షపతి,ఇతావ నర్సింహా,పల్లెర్ల రామచంద్రు,మైసోళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్ పుల్లమ్మ



పాలేరు (ప్రజాపాలన ప్రతినిధి ) మార్చి 1 ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని కోనాయిగూడెం అంగన్వాడి కేంద్రం లో మొదటి. యన్.హెచ్.డి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ హాజరై బాలామృతం ప్యాకెట్స్ పంపిణీ చేశారు.అనంతరం సర్పంచ్ పెంట మల్ల. పుల్లమ్మ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీరబాబు, అంగన్వాడి టీచర్ వడ్లమూడి నాగమణి, ఆశ బేబీ,ఆయా సావిత్రి, పిల్లల తల్లులు తిరుపతమ్మ,బి. జ్యోతి,బి. వాణి, బి. స్వప్న పాల్గొన్నారు.

## కోదండరాం కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి ప్రస్తుతం జరుగనున్న నల్లగొండ,ఖమ్మం,వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా తెలంగాణ జన సమితి పార్టీ అభ్యర్థి ప్రొపెసర్ కోదండరాం కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వలిగొండలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తూ కోదండరాం ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిజెఎస్ పార్టీ అధ్యక్షుడు బుంగ సునిల్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్ల నిధులు నియామకాలలో టిఆర్ఎస్ పార్టీ విఫలమైందని అన్నారు.ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చే ప్రొఫెసర్ కోదండరామ్ ను శాసన మండలికి పంపాలని ఆయన కోరారు.



# ఎమ్మెల్సీ పట్టభద్రులకు ఎన్నికల అవగాహన

## 50 మంది ఓటర్లకు ఒక ఇంచార్జ్

## 10 మంది ఇంచార్జులకు మరొక ఇంచార్జ్

## ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్ జిల్లా మార్చ్ 01 (ప్రజాపాలన ప్రతినిధి) : సోమవారం జిల్లా ఇంఛార్జి జహంగీర్ పాషా, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అధ్యక్షతన వికారాబాద్ పట్టణంలోని క్లబ్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణకు సంభందించిన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రతి 50 (యాభై) మంది ఓటర్లకు ఒక ఇంఛార్జిని నియమించడం జరిగింది ఇలా నియమించిన ప్రతి 10 మంది ఇంచార్జికు ఇంకొక ఇంచార్జిని నియమించారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మన్ విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, పిఏసిఎస్ చైర్మన్లు, ఏఎంసి చైర్మన్లు, పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ పట్టభద్రుల అవగాహన సమావేశాన్ని నిర్వహించామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వివేక వాణి పాఠశాలలో టిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి సురభి వాణి దేవికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. టిఆర్ఎస్ అభ్యర్థి విజయానికి సహకరించాలని



కోరారు.ఉపాధ్యాయులు అందరూ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

వైద్య సేవలు అందించి మానవత్వాన్ని చాటిన ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ :

వికారాబాద్ పట్టణ పరిధిలోని కొండా బాలకృష్ణా రెడ్డి గార్డెన్ ముందు గుర్తు తెలియని వ్యక్తి యాక్సింట్ కారణంగా రోడ్డుపై పడ్డాడు. ఆ దారి గుండా వెళ్తున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి రోడ్డు పై పడ్డ వ్యక్తి శ్వాస నాడిని పరీక్షించి తగు వైద్య సహాయం అందించారు.రోడ్డు ప్రమాదంలో తీవ్ర రక్త గాయాలైన వ్యక్తిని ఆటోలో ఎక్కించి హుటాహుటిన వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే ఆ వ్యక్తికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆసుపత్రి వైద్యులకు ఫోన్ లో ఆదేశించారు.



## గ్రంథాలయానికి కుర్చీల బహుకరణ

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి :మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి పాఠకుల సౌకర్యార్థం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ కిరాణా వ్యాపారి గజ్జెల వెంకటేశం సునీత సోమవారం ఐదు వేల రూపాయల విలువగల కుర్చీలను బహుకరించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి చైర్మన్ పబ్బు వెంకటరమణ గ్రంథాలయానికి కుర్చీలు అందజేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిట్టల ఆంజనేయులు,పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యగిరి ఆలయంలో ఈనెల 3తేదీన స్వాతి కళ్యాణం

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి : మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో ఈనెల 3 న బుధవారం స్వాతి నక్షత్రం సందర్భముగా స్వామివారి కళ్యాణం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని,అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని భక్తులు ఆదిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కార్యనిర్వహణాధికారి రవికుమార్,ధర్మకర్తల మండలి చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## బిజెపి ఎన్నికల ప్రచారం



మధిర మార్చి 1ప్రజా పాలన ప్రతినిధి: ఎమ్మెల్సీ ఎలక్షన్స్ సందర్భంగా ఎర్రుపాలెం బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కార్యకర్తలతో కలిసి మీనవోలు గ్రామంలో ఓటర్ క్యాంపెయిన్ చేస్తూ ఓటర్లను బిజెపి పార్టీ అభ్యర్థి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ క్యాంపెయిన్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ ప్రెసిడెంట్ ముక్కపాటి శ్రీనివాసరావు మండల జిల్లా కిసాన్మోర్చా కార్యదర్శి పుపాళ్లా చంద్రమౌళి బీసీ సెల్ మండల పార్టీ అధ్యక్షుడు పురం నాగేశ్వరరావు మీనవోలు గ్రామ అధ్యక్షుడు పురం గోపాలరావు మండల ఉపాధ్యక్షుడు నేరెళ్ల ఈశ్వరరావు గౌరవ అధ్యక్షులు వేము ఏడుకొండలు పసుపులేటి కృష్ణ బొగ్గుల సుధాకర్ రావు కాశీ ఉపేందర్ పాల్గొన్నారు.

## వాణీదేవిని భారీ మెజార్టీతో గెలిపించాలి



వేడిపల్లి, మార్చ్1 (ప్రజాపాలన ప్రతినిధి) :పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎన్ అభ్యర్థి వాణీదేవిని భారీ మెజార్టీతో గెలిపించాలని పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పీర్జాదిగూడ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో చెన్నూరు శాసన సభ్యులు బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, రాష్ట్ర నాయకులు శ్రీధర్ రెడ్డి, చామకూర భద్రా రెడ్డి పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసినారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎంపల్ల అనంత్ రెడ్డి, కౌడే పోచయ్య, కేతావత్ సుభాష్ నాయక్, మద్ది యుగేందర్ రెడ్డి, పిట్టల మల్లేష్, కో ఆప్షన్ సభ్యులు బొడిగే రాందాస్ గౌడ్, షేక్ ఇర్ఫాన్, నాయకులు పప్పుల అంజి రెడ్డి, బైటింటి ఈశ్వర్ రెడ్డి, బొడిగే కృష్ణ గౌడ్, అలువాల దేవేందర్ గౌడ్, చెరుకు పెంటయ్య గౌడ్, జావిద్ ఖాన్, మనోరంజన్ రెడ్డి, నిర్మల, రఘువర్ధన్ రెడ్డి, డివిజన్ ఇంచార్జ్ లు, తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది నారిసేన గ్లోబల్ ఉమెన్ ఫోరమ్ సంస్థ

శేరిలింగంపల్లి, ప్రజాపాలన : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తోటి పేద మహిళలకు సేవ చేయాలనే సంకల్పంతో నారిసేనా గ్లోబల్ ఉమెన్ ఫోరమ్ సంస్థ అని వ్యవస్థాపకురాలు లతా చౌదరి అన్నారు. సమాజంలో వెనుకబడిన మహిళలను చైతన్య పరచడం కోసం ఏర్పాటు చేసిన నారిసేన ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నిరు పదాలకు సాయం చేయడం కోసం వివిధ రకాల వస్తువులు సేకరించి అవసరం ఉన్న వారికి అందజేస్తున్నామని తెలిపారు. నారిసేన గ్లోబల్ ఉమెన్ ఫోరమ్ మరియు జ్యోతి విద్యాలయ హై స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రోజు శేరిలింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులతో పాటు బట్టలు, బిస్కెట్లు అందజేశారు. ఇంట్లో వాడే వస్తువులు సేకరించి అవసరం ఉన్నవారికి అందజేయడం ఫోరమ్ లక్ష్యమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరించడం కోసం మహిళలకు ఉచితంగా వివిధ రకాలైన టైలరింగ్, పెయింటింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ , కాలంకారి, డాల్స్ మేకింగ్ వంటి కలనైపుణ్యాలను వెలికి తీసి వారిని నిష్ణార్థులుగా తయారు చెపిస్తామన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన 150 మంది మహిళలు సొంతంగా వ్యాపారం చేసుకుంటూ స్థిర పడ్డారని తెలిపారు. అలాగే వారి సమస్యలు తీర్చడానికి న్యాయ సలహాలు అందించడానికి లీగల్



సెల్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 20 దేశాల్లో , 50 వేల మంది ఈ ఫోరమ్ లో పని చేస్తున్నారని ఆమే తెలిపారు. జ్యోతి విద్యాలయ హై స్కూల్ ప్రిన్స్ పల్, ఫోరమ్ అడ్మిన్ ఉమా మహేశ్వరి మాట్లాడుతూ మా స్కూల్ తరుపు నుండి కూడా సిబ్బందిని, తల్లిదండ్రులను సేవలో భాగస్వాములను చేస్తూ, తమకు తోచిన విధంగా సహాయ సాకరలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 25 నుండి మార్చ్ 5 వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో ఇలా వస్తువుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి టీమ్ లీడర్స్ మణిప్రభ, దివ్యజ్యోతి, యశోద, చందనగర్ టీమ్ లీడర్స్ నీలం సౌమ్య,ఆలేఖ్య, శాంతి, విధ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# పొట్ట అంతా హాయిగా...



ఎంతసేపూ, కడుపులోంచి వస్తున్న శబ్దాలవైపే మనసు వెళుతుంటే, ఎదురుగా ఉన్నది ఏం కనపడుతుంది! ఎదుటివాళ్లు చెప్పేది ఏం వినపడుతుంది! నిరంతరం మలబద్ధకంతో సతమతమయ్యే వారి పరిస్థితి ఇలాగే ఉంటుంది మరి! మనం తీసుకునే ఆహారం ఎంత గొప్పదైనా కావచ్చు.

అందులో ఏదో ఒక మోతాదులో వ్యర్థాలు లేకుండా ఉండవు కదా! అ వ్యర్థాలన్నీ పూర్తిస్థాయిలో విసర్జించబడుతున్నాయా, లేదా అని ఎంత మంది ఆలోచిస్తారు? నిజానికి, అనేక రుగ్మతలకు ఆరంభ దశ, మూలకారణం మలబద్దకమే. శరీరంలోని ఇతర జీవక్రియల్లాగే జీర్ణక్రియ, విసర్జన క్రియలు కూడా సహజంగా సాగిపోవాల్సినవే. కానీ, కొన్నిసార్లు ఎక్కడో తేడా వస్తుంది. ఆ వెంటనే సహజ ధర్మాలన్నీ కుంటుబడతాయి. ఈ స్థితిలో ఎక్కువ మందిని వేధించే ఒక ప్రధాన సమస్య మలబద్ధకం. ఈ సమస్య దీర్ఘకాలికంగా ఉంటే శరీరం విషతుల్యం కావడం, ఆ తర్వాత నిరంతరం రోగగ్రస్థం కావడం ఖాయం.

ఎందుకొస్తుందీ సమస్య?

మలబద్ధకం రావడానికి గల కారణాలు ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉండవచ్చు. అయితే మౌలికంగా, అత్య?ధికుల్లో అజీర్తి ఒక ప్రధాన కారణం. నిజానికి, అజీర్తి, మలబద్ధకం పరస్పరం విడదీయరాని సమస్యలు. సాధారణంగా ఒకటి లేకుండా మరొకటి ఉండదు. జీర్ణప్రక్రియకు జఠర రసమూ, జఠరాగ్ని ప్రధానమని మన ఆయుర్వేద, సిద్ధ, యునాని వైద్యాలు చెబుతాయి. ప్యాంక్రియాస్ ప్రధాన ప్రక్రియ ఇన్సులిన్ ఉత్పత్తి అని చాలామంది అనుకుంటారు. వాస్తవానికి మనం తినే ప్రధాన పోషక పదార్థాలు జీర్ణం కావడానికి కావలసిన ఎంజైములన్నీ ప్యాంక్రియాసే ఉత్పత్తి చేస్తుంది.

పిండి పదార్థాన్ని అమైలేస్, కొవ్వులను లిపేస్, వ ృక్ష సంబంధ పీచును సెల్యులేస్, మాంసక ృత్తులను ప్రొటియేస్, పంచదారను ఇన్సులిన్ అనే పాంక్రియాస్ ఎంజైములు జీర్ణం చేస్తాయి. మనం తిన్న ఆహార పదార్థాల నిష్పత్తులకు సరైన మోతాదుల్లో పైన వివరించిన ఎంజైములు జీర్ణప్రక్రియకు లభించనప్పుడు ఆహారం పూర్తిగా జీర్ణం కాకుండానే చిన్న పేగులోంచి వెళ్తుంది. పెద్దపేగులో అది పులుస్తుంది. కుళ్లుతుంది. అపానవాయువు ఉత్పత్తి అవుతుంది. కడుపు ఉబ్బి, నొప్పి వస్తుంది. ఈ సమస్యకు కొందరు, భోజనం చేసిన ప్రతిసారీ పాంక్రియాటిక్ ఎంజైము కాప్సుల్స్ వాడుతూ ఉంటారు. వీటివల్ల కలిగేది తాత్కాలిక ఉపశమనమే. నిజానికి, మనం తీసుకునే ఆహారంలో ప్రధాన సూక్ష్మపోషక పదార్థాలు సరైన మోతాదులలోనూ, నిష్పత్తుల్లోనూ ఉండేలా చూసుకోవడమే దీనికి శాశ్వత పరిష్కారం.

చూర్ణాలతో ఎంత కాలం?

మలబద్దకం సమస్యతో దీర్ఘకాలికంగా బాధపడుతున్న వారిలో కొందరు త్రిఫల చూర్ణ, కాయచూర్ణ, ఇసబ్‌గోల్ లాంటి విరోచన కారక ఔషధాలు వాడుతూ ఉంటారు. వీటిని వారానికి రెండు మూడుసార్లయినా వేసుకోనిదే కొందరికి పొట్ట మామూలుగా ఉండదు.

మరికొందరికైతే రోజూ వేసుకుంటే తప్ప ఆ బాధ నుంచి బయటపడరు.

వీటిని వాడకతప్పని అత్యవసర పరిస్థితులు అప్పుడప్పుడు ఉంటే అదంత సమస్య కాకపోవచ్చు. కానీ వీటిని ప్రతిరోజూ వాడటం వల్ల అవి పేగుల సహజ ప్రక్రియలను కుంటుపరిచి, సమస్యను దీర్ఘకాలికమూ, జటిలమూ చేస్తాయి.

జీవనశైలిలో మార్పులు

శరీరానికి అవసరమైన మేర నీరు తాగడంతో పాటు, పీచు పదార్థమున్న ఆహార పదార్థాలకు ప్రాధాన్యమివ్వడం చాలా అవసరం. ఆకు కూరల్ని కాయ కూరల్ని అతిగా ఉడికించడం వల్ల వాటిని తీసుకున్న ప్రయోజనం కూడా ఉండదు. అవసరమైన ఆహార పానీయాలతో పాటు, రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా తప్పనిసరి.

వైద్య చికిత్సలు

ఎంత దీర్ఘకాలికంగా వేధిస్తున్న మలబద్ధకాన్నయినా మూలికా వైద్యం శాశ్వతంగా నయం చేస్తుంది.

నిరంతరం విరేచనకారక ఔషధాలు వాడే అవసరం లేకుండా, మూడు నుంచి నాలుగు మాసాల కాలంలో నిశ్చితంగా, శాశ్వతంగా నయం అవుతుంది.

ఔషధ మిళిత యాపుల్ సిడార్ వెనిగర్ వాడితే, పొటాషియం లవణాలను, విటమిన్లను, ఎంజైములను, ఖనిజాలను, అమినో యాసిడ్లను అందిస్తుంది. ఆల్ఫాల్ఫా గింజల కషాయం అత్యంత బలవర్ధకం. అనేక జీర్ణవాహిక వ్యాధులు, కీళ్ల నొప్పులను ఇది ఒక్కటే నయం చేయగలదు. సాధారణ వైద్య చికిత్సలతో పాటు ఆయా వ్యక్తుల శరీర ధర్మాన్ని, అప్పటిదాకా వారు అనుసరిస్తూ వస్తున్న జీవనశైలిని పరిశీలించి తదనుగుణమైన చికిత్సలను మూలికా వైద్యం అందిస్తుంది.

# నిద్ర సమస్యకు అవే కారణమా..!



ఓ సినిమాలో విలన్ పోలీసులకు చిక్కుతాడు...అతడికి పోలీసాఫీసర్ వేసే శిక్ష ఏంటో తెలుసా? 'ఈ రోజు నుంచి తిండి, నీళ్లు ఇవ్వండి.. కానీ నిజం చెప్పే వరకూ నిద్రపోనీయకండి' అని సిబ్బందిని ఆదేశిస్తాడు.. ఒకవేళ నిద్రపోతే... లాఠీలతో కొట్టమని చెబుతాడు.. నిద్రలేకపోతే కలిగే ఇబ్బందితో నిజం చెబుతాడని అలా శిక్ష విధిస్తాడు. కానీ.. చాలా మంది ఎవరికి వారే శిక్ష విధించుకుంటున్నారు. నిద్రను బాగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా రకరకాల జబ్బుల బారిన పడుతున్నారు.

నగరంలోని ఐటీ ఉద్యోగులు నిద్రకు బాగా దూరం అవుతున్నట్టు తాజాగా ఓ కార్పొరేట్ ఆస్పత్రి చేసిన సర్వేలో వెల్లడైంది. కొద్ది నెలలుగా నగర ఐటీ ప్రొఫెషనల్స్‌పై డాక్టర్ నళిని నేత ృత్వంలోని బ ృందం 500 మంది ఐటీ ఉద్యోగుల నిద్రకు సంబంధించిన అంశంపై అధ్యయనం చేసింది. 25 - 45 ఏళ్ల మధ్య వయస్కులను ఇందుకోసం ఎంపిక చేసింది. ఈ సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

సగం మందికి నిద్ర సమస్యే..

సర్వేలో పాల్గొన్న వారిలో 60శాతం మందికి నిద్ర సమస్యలతో బాధపడుతున్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. అందులో 38 శాతం మంది గురకతో బాధపడుతున్నారు. పైగా సర్వేకు ఎంచుకున్నవారంతా పగలు మాత్రమే పనిజేసేవారు కావడం విశేషం. నెలకు కనీసం ఒక్కసారి కూడా వ్యాయమం చేయనివారి సంఖ్య 39 శాతంగా ఉంది. ఇక 96 శాతం మంది నిద్రపోయే ముందు కూడా సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, ల్యాప్‌టాప్‌లను వాడుతున్నారని తేలింది. నిద్రపోయే గంట ముందు వరకు కూడా49 శాతం మంది ఆఫీసుకు సంబంధించిన వర్క్‌ను చేస్తున్నట్టు వెల్లడించారు. మరి కొంతమంది నిద్ర మధ్యలో మెలుకువ వస్తే... వెంటనే సెల్‌ఫోన్‌లో మెయిల్స్ చెక్ చేసుకుంటున్నారట. నిద్రకు సంబంధించి 30 రకాల ప్రశ్నలను వారిపై వేసి సమాధానాలు రాబట్టారు. మొత్తంగా 50 శాతం ఉద్యోగుల నిద్రలేమి సమస్యలకు ప్రధాన కారణం పడుకునేముందు వరకు కూడా ఎలక్ట్రానిక్ వస్తువులతో గడపటమేనని తేలింది. అలాగే మోతాదుకు మించి కాఫీ,టీ, కూల్‌డ్రింక్స్ తాగడం, వ్యాయమం లేకపోవడం, జీవనశైలి విధానం కూడా నిద్ర సమస్యలకు కారణాలుగా తేలింది.

నిద్రపట్టకపోవడానికి అసలు కారణమిదే...

ప్రతి ఒక్కరూ నిద్రపోవాలంటే మెదడులోని మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి కావాల్సి ఉంటుంది. గాఢ నిద్రపట్టకపోవడానికి ప్రధాన కారణం హార్మోన్ తగినంత ఉత్పత్తి కాకపోవడమే. రాత్రివూట ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ట్యాబ్స్, టీవీల నుంచి వచ్చే తెలుపు, బ్లూ, ఆకుపచ్చ కాంతి ఎక్కువసేపు చూడటం వల్ల కంటిపై ఒత్తిడి పెరిగి మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి కాకుండా ఆగిపోతోంది. రోజుల తరబడి ఇటువంటి ఇలాంటి జీవన విధానాన్నే కొనసాగిస్తే నిద్రరావడం ఆగిపోతుంది.

నిద్రపోకపోతే ఏమవుతుందంటే...

శారరీక, మానసిక సమస్యలు తలెత్తుతాయి. ఉదయం లేవగానే తలనొప్పి మొదలవుతుంది. నిద్రపోయిన ఫీలింగ్ ఉండదు. పగలు కునుకు వేయాలనిపిస్తుంది. డ్రైవింగ్‌లోనూ నిద్ర వస్తుంది. నీరసంగా ఉంటూ... ఒకటే ఆవలింతలు వస్తాయి. పనిపై శ్రద్ధ ఉండదు. రాత్రివూట గురకపెట్టడం, నిద్రమధ్యలోనే మేల్కోవడం, టాయిలెట్‌కు వెళ్లడం లాంటి సమస్యలను ఎదుర్కొంటారు. బీపీ, షుగర్, స్థూలకాయం, డిప్రెషన్‌లోకి వెళ్లడం, గుండె సంబంధిత జబ్బులు రావడం, మతిమరుపు, జుట్టు రాలడం, హార్మోన్స్ సమతుల్యత దెబ్బతినడం, జీర్ణవ్యవస్థ దెబ్బతినడం, లైంగిక జీవితంలో ఆసక్తి లేకపోవడంతో పాటు రకరకాల సమస్యలు వస్తాయి.

మంచి నిద్రకు మార్గాలివే..

పగలు కునుకు తీయవద్దు.

నిత్యం వ్యాయామం చేయాలి.

నిద్రపోయేముందు మితంగా భుజించాలి.

సహజసిద్ధమైన కాంతిలో నిద్రించాలి.

పడుకునేముందు పుసక్తపఠనం చేస్తే మంచిది.

పడుకునే గంటముందు ఎలక్ట్రానిక్ వస్తువులను వాడటం ఆపేయాలి.

కెఫిన్, నికొటిన్, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి.

రోజూ ఒక సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి.

వారి సంఖ్య బాగా పెరుగుతోంది

నిద్ర సమస్యతో బాధపడేవారి సంఖ్య బాగా పెరుగుతోంది. ప్రతీ వంద మందిలో 13 మంది ఇటువంటి సమస్యతో బాధపడుతుండగా ఐటీ ఉద్యోగుల్లో ఇది ప్రమాదకరరీతిలో ఉంది. నిద్రపట్టకపోవడానికి రెండు కారణాలుంటాయి. ఒకటి నిద్రలేమి, మరొకటి స్లీప్ అప్నియా. నిద్రలో కూడా శరీరంలో ప్రతి అవయవానికీ ఆక్సిజన్ అవసరం అవుతుంది. ఏళ్ల తరబడి అది అందకపోతే సహజంగానే అవి దెబ్బతింటాయి. గతంలో పగలంతా కాంతిలో, రాత్రి చీకటిలో ఉండేవాళ్లం. ఆ వ్యవస్థ నిద్రకు మంచిది. కానీ ఇప్పుడంతా రివర్స్. పగలంతా లైట్ల కాంతిలో, రాత్రి బ్రైట్ లైట్స్ కాంతిలో బతుకుతున్నాం.

ఇది నిద్రవ్యవస్థను దెబ్బ తీస్తోంది. నిద్రపోయే గంటముందు ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌ను వాడటం ఆపేయాలి. అమెరికాలో చేసిన సర్వేలో కూడా 97 శాతం మంది నిద్రపోయే ముందు ఇలాగే ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ వాడతారని తేలింది. నా సర్వేలో కూడా 96 శాతం మంది ఐటీ ప్రొఫెషనల్స్ వీటిని వాడుతున్నారు. అదే నిద్రపోవడానికి ప్రధాన సమస్య అని తేలింది.

# నొప్పికీ ఓ లెక్కుంది



ఎలాంటి నొప్పినైనా వైద్యులకు వివరించాల్సి వచ్చినప్పుడు ఎలా చెప్పాలో అర్థం కాక ఇబ్బంది పడతాం. కానీ నొప్పిని కచ్చితంగా గుర్తించటానికి వైద్యులు' పెయిన్ స్కేల్'ను వాడతారు. తీవ్రతను బట్టి నొప్పికి 1 - 10 అంకెలు కేటాయించారు. కాబట్టి ఈసారి ఎలాంటి నొప్పి గురించి వైద్యులను కలిసినా ఈ పెయిన్ స్కేల్ ప్రకారం నొప్పిని వివరించండి.

స్వల్పంగా (మైల్డ్): చాలా తక్కువ. మరీ అంత ఇబ్బంది పెట్టట్లేదు. రోజు మొత్తంలో దాని గురించి ఆలోచనే రాదు.

కొద్దిగా (మైల్డ్): నొప్పి ఉంది. చిరాకు పెడుతూ ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్రమవుతూ ఉంటుంది.

అసౌకర్యం (అన్‌కంఫర్టబుల్): నొప్పి బాధిస్తూ ఉంటుంది. ఎప్పుడూ ఉంటుంది. దానికి అలవాటు పడి పనుల్లో పడిపోతూ ఉంటారు.

మోస్తరుగా (మోడరేట్): ఏదైనా పనిలో పడిపోయినప్పుడు నొప్పి తెలియదు. అయినా నొప్పి మాత్రం అదే పనిగా విసిగిస్తూనే ఉంటుంది.

దేని మీదా ఏకాగ్రత పెట్టలేనంత (డిస్‌ట్రాక్టింగ్): విపరీతమైన నొప్పి. కొద్ది నిమిషాలు కూడా వదిలిపెట్టదు. అయితే ప్రయత్నం మీద నొప్పి మీద నుంచి ధ్యాస మళ్లించి పనులు చేసుకోగలుగుతున్నారు.

వ్యథాభరితంగా (డిస్‌ట్రెసింగ్) : రోజువారీ జీవితాన్ని ఇబ్బంది పెట్టే నొప్పి. నొప్పి వల్ల ఏ పనీ చేయలేకపోతూ ఉండటం.

తీవ్రం (సివియర్): పంచేంద్రియాలను డామినేట్ చేసేటంత నొప్పి. నొప్పితో ఒక ప్రదేశానికే పరిమితమైపోవటం, ఎవరితో కలవలేకపోవటం, నిద్ర పట్టకపోవటం.

అత్యంత తీవ్రంగా(ఇంటెన్స్): శారీరాన్ని కదిలించలేకపోవటం. భరించరానంతగా నొప్పి. అతి కష్టం మీద మాట్లాడగలగటం.

భరించలేనంత(ఎక్స్‌క్రూషియేటింగ్): నొప్పి వల్ల మాటలు రాకపోవటం. బెడ్ మీది నుంచి అడుగు కూడా కదలలేకపోవడం. బిగ్గరగా ఏడ్వటం/ మూలగటం.

మాటల్లో చెప్పలేనంత (అన్‌స్పీకబుల్): మంచానికే పరిమితమై, ఏం జరుగుతుందో కూడా తెలియకపోవడం. ఎవరికీ చెప్పుకోలేని స్థితి. స్ప ృహ కోల్పోతూ ఉండటం.

నొప్పి గురించి చెప్పేటప్పుడు దొర్లే తప్పులు

సాధారణంగా వైద్యులకు నొప్పి గురించి వివరించేటప్పుడు ఉన్నదాని కంటే ఎక్కువ చేసి చెపుతూ ఉంటాం. అది రెండు పద్ధతుల్లో చేస్తూ ఉంటాం.

ఏ పెయిన్ స్కేల్‌తో పోలిస్తే నొప్పి 12 ఉందని చెప్పటం: నొప్పి తీవ్రతను వైద్యులకు వివరంగా చెప్పాలనే ఉద్దేశంతో ఇలా చెప్తూ ఉంటాం. కానీ ఇలా చెప్పటం వల్ల మీరు ఉన్నదాన్ని ఎక్కువ చేసి చెబుతున్నట్టు డాక్టర్లు గ్రహిస్తారు. దాంతో మీ నొప్పి తీవ్రతను కచ్చితంగా అంచనా వేయలేకపోతారు.

ఏ నొప్పి గురించి నవ్వుతూ చెప్పటం: నొప్పి తీవ్రంగా ఉన్నప్పుడు మాట్లాడటమే కష్టం. అలాంటిది నవ్వుతూ మాట్లాడుతున్నామంటే నొప్పి భరించగలిగే స్థాయిలోనే, 10 లోపలే ఉందని అర్థం. ఎపిడ్యురల్ ఇంజెక్షన్ లాంటి నొప్పిని తగ్గించే ఇంజక్షన్ సహాయం లేకుండా జరిగే సాధారణ ప్రసవ నొప్పులే పెయిన్ స్కేల్‌లో 8 స్థానాన్ని సూచిస్తాయని గుర్తు పెట్టుకోండి. కాబట్టి వైద్యులకు అవసరాన్ని మించి నొప్పిని ఎక్కువ చేసి చెప్పటం వృథా ప్రయాసే అనే విషయాన్ని గ్రహించండి.

# రాత్రి నిద్ర కరువైతే..



కొందరేమో చిలుకల్లా పగలంతా పనిచేసి రాత్రంతా నిద్రిస్తారు. కొందరేమే గుడ్లగూబల్లా రాత్రంతా పనిచేసి పగలంతా నిద్రిస్తారు. అయితే "గుడ్లగూబ తరహా జీవన శైలిని అలవర్చుకున్న వారు ఎప్పుడో ఒకప్పుడు భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వస్తుంది", అంటున్నారు పరిశోధకులు. మీరు చిలుకలు అవుతారో, గుడ్లగూబలుగానే ఉండిపోతారో మీకు మీరే తేల్చుకోండి.

"త్వరగా నిద్రపోయి, త్వరగా మేల్కోవాలి" అనేది పాత కాలపు మాటలా అనిపించవచ్చు. రాత్రంతా పనిచేసి పగటిపూట నిద్రపోతే తప్పేంటి అనిపించవచ్చు. ఈ రోజుల్లో ఎక్కువ మంది ఈ పంథానే అనుసరిస్తూ ఉండవచ్చు కూడా. కానీ, ఎక్కువ మంది అనుసరించే మార్గమే అయినంత మాత్రాన అది ఉత్తమమైనదేమీ అయిపోదు కదా! ఎప్పుడో అరుదుగా, అనివార్యంగా అయితే సరే కానీ, రాత్రుళ్లు మేల్కొనడమే జీవన శైలి కాకూడదు. అదే జరిగితే, ఆ ఎదురయ్యే పరిణామలు అన్నీ ఇన్నీ కావు....

కొంతమంది తాత్కాలిక అవసరాల కొద్దీ అనివార్యంగానే ఈ వి?ధానాన్ని అనుసరించి ఉండవచ్చు. కానీ, ఆ తర్వాతర్వాత అదే ఒక అలవాటుగా మారిపోతుంది. రాత్రంతా మేల్కొనడంలో ఇబ్బంది కూడా ఏమీ అనిపించకపోవచ్చు. దానికి కారణం ప్రక ృతి విరుద్ధంగా తమ జీవగడియారాన్ని (బయోలాజికల్ క్లాక్) సర్దుబాటు చేసుకోవడమే. కానీ, డాక్టర్ల అభిప్రాయం ప్రకారం, మునుముందు నిద్రా సమస్యలు, యుక్తవయసులోనే గుండె జబ్బులు, డిప్రెషన్ వంటి రుగ్మతల పాలయ్యే అవ కాశాలు ఎక్కువగా ఉంటాయి.

జి సహజంగా నిద్రించాల్సిన సమయంలో మేల్కొని ఉంటే శరీరం వేడెక్కుతుంది. ఇది జీవ క్రియల అలసత్వానికి కారణమవుతుంది. వ్యాధినిరోధక శక్తి కుంటుపడేలా చేస్తుంది. మనలోని హార్మోన్ల, ఎంజైముల ఉత్పత్తికి తమదైన ఒక కాలమాన ప్రణాళిక ఉంటుంది. సహజంగా గ్లూకోజ్ ఎక్కువగా అవసరమయ్యే ఉదయం వేళల్లో కార్టిజాల్ హార్మోన్ పెద్ద మొత్తంలో ఉత్పన్నమవుతుంది. శ్రమ తగ్గిపోయే సాయంత్రానికి ఆ ఉత్పత్తి తగ్గిపోతుంది. అయితే ఈ బయోలాజికల్ క్లాక్‌ను తారుమారు చేసినప్పుడు ఈ హార్మోన్ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది.

బయోలాజికల్ క్లాక్ వ్యవస్థ అనేది మనిషి మనిషికీ వేరుగా ఉండదు. వ్యక్తుల శారీరక వ్యత్యాసాల వల్ల ఏదైనా తేడా ఉన్నా అది స్వల్పవే. అందుకే ఎవరికి వారు నిద్రా, మెలకువల సమయాన్ని తమ ఇష్టానుసారంగా మార్చుకోవడం కుదరదు. రాత్రంతా మేలుకునే వాళ్లు కొందరు " ఈ టైమింగ్స్ వల్ల మాకు అసౌకర్యంగా గానీ, అస్వస్థతగా గానీ ఏమీ ఉండడం లేదు. పైగా ఉత్సాహంగా, హుషారుగానే ఉంటున్నాం. ఇక ఇబ్బంది ఏముంది?" అంటూ ఉంటారు. అయితే, పైకి అంతా సవ్యంగానే ఉన్నట్లు అనిపించినా, లోలోపల జరిగే నష్టం జరుగుతూనే ఉంటుంది.

మౌలికంగా సూర్యగమనానికీ, ఆకలికీ అవినాభావ సంబంధం ఉంది. ఉదయాస్తమయాల మధ్య సరిగ్గా పనిచేస్తూ ఉంటుంది. ఆలోచనలకూ, కార్యాచరణకూ మూలాధారంగా మనలో ఒక ప్రాణశక్తి ఉంటుంది. అది జీవితాంతం మన తోడై ఉంటుంది. అయితే రాత్రిళ్లు ఎక్కువగా మేల్కొనే వాళ్లల్లో ఈ ప్రాణశక్తి అత్యధికంగా ఖర్చు అవుతుంది. దీనివల్ల యుక్త వయసులోనే శరీరం రోగగ్రస్తం కావడం, అకాల వ ృద్ధాప్యం రావడం సంభవిస్తాయి. రాత్రివేళల్లో జీర్ణక్రియకు తోడ్పడే ఎంజైములు కూడా స్వల్పంగానే ఉత్పన్నమవుతాయి. ఈ కారణంగా మధ్యరాత్రి చేసే భోజనం సరిగ్గా జీర్ణం కాదు. శరీరమంతా నిద్రావస్థలో ఉండడం కూడా ఇందుకు కారణం. కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి జీర్ణాశయ సమస్యలే కాదు స్థూలకాయం రావడానికి కూడా ఈ కారణాలే ప్రధానంగా ఉంటాయి. అందుకే.....,నా శరీరం, నా ఇష్టం అనే ధోరణితో కాకుండా, ప్రకృతి సహజ నియమాలను ఎవరైనా విధిగా పాటించడమే శ్రేయస్కరం.

## సెకండ్ ఒపీనియన్ మేలే!



వ్యాధి నిర్ధారణ విషయంలో గానీ, సర్జరీ అవసరం అన్నప్పుడు గానీ, ఒక్కోసారి సందిగ్ధం ఏర్పడవచ్చు. అలాంటి సమయంలో మరో డాక్టర్ అభిప్రాయం కోసం వెళ్లడం కొన్ని సార్లు అవసరమవుతుంది. ఈ స్థితి ఒక్కోసారి పేషంట్ కారణంగానూ ఏర్పడవచ్చు. మరికొన్నిసార్లు డాక్టర్ కారణంగానూ ఏర్పడవచ్చు. ఎందుకంటే పేషంట్ ఒక్కోసారి తనకున్న సమస్యల గురించిన పూర్తి వివరాలు ఆ డాక్టర్‌కు చెప్పలేకపోయి ఉండవచ్చు. లేదా అతి ముఖ్యమైన విషయాన్ని చెప్పడం మరిచిపోయి అంత ప్రాధాన్యత లేని విషయాన్నే చెప్పి ఆగిపోవచ్చు ఇలాంటి సమయాల్లో మరో డాక్టర్‌ను కలిసినప్పుడైనా అంతకు ముందు చెప్పలేని విషయాలు చెప్పే అవకాశం ఉంటుంది.సర్జరీ విషయంలో అయితే, సర్జరీ నిజంగానే అవసరమా? వ్యాధి, మందులతోనే తగ్గిపోయే అవకాశం ఉందా? ఇలాంటి సమాచారం మరో డాక్టర్‌ను సంప్రదించినప్పుడు లభించే అవకాశం ఉంది. కొన్ని సర్జరీల విషయంలో డాక్టర్లకు భిన్నాప్రాయాలు ఉండవచ్చు. ఏవో కొద్దిపాటి తేడాలే తప్ప ప్రధాన అంశంలో ఏకాభిప్రాయమే ఉంటే, అప్పుడు ఒక నిర్ణయానికి రావచ్చు. ఒకవేళ ఇద్దరి అభిప్రాయాలూ పూర్తి విరుద్ధంగా ఉంటే అప్పుడు మూడో అభిప్రాయానికి కూడా వెళ్లవలసి రావచ్చు. కాకపోతే అలాంటి సందర్భం చాలా అరుదుగానే వస్తుంది.ఒక డాక్టర్‌ను కలిశాక మరో డాక్టర్ అభిప్రాయానికి వెళ్లడం వల్ల మొదటి డాక్టర్ మనస్తాపానికి గురికావడం అనేది ఈ రోజుల్లో లేదు. మరో డాక్టర్ కూడా అదే అభిప్రాయానికి వస్తే, పేషంట్‌కు తన మీద మరింత నమ్మకం ఏర్పడుతుందని డాక్టర్ భావిస్తారు అందుకే, ఒక్కోసారి డాక్టర్లే స్వయంగా మీరు మరో డాక్టర్ అభిప్రాయం కూడా తీసుకోవచ్చని చెబుతుంటారు. ఇది ఇటు పేషంట్‌కూ, అటు డాక్టర్‌కూ పాజిటివ్ విషయమే అవుతుంది.

# ఇలా మానేయవచ్చు..!

సరదాగా మొదలుపెట్టిన ధూమపానం... తరువాత వ్యసనంగా మారిపోతుంది. వద్దు వద్దనుకున్నా ఓ దమ్ము కొట్టనిదే ఏ పనీ చేయలేని పరిస్థితికి లాగేస్తుంది. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు పొగ తాగడం మానేద్దామని చాలామందే అనుకుంటారు. కానీ... అందులో నుంచి బయటకు రాలేక సతమతమవుతుంటారు. అలా ప్రయత్నించేవారి కోసమే ఈ చిట్కాలు...

బీ పాజిటివ్: మీకో విషయం తెలుసా... పొగ తాగడం ఆపేస్తే కేన్సర్ అవకాశాలను సగం తగ్గించినట్టే! ధూమపానం ఆపేద్దామనుకున్నప్పుడు ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. అలా జరగాలంటే సిగరెట్ వంటివి మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ముందుగా తెలుసుకోవాలి. 'దమ్ము వేయకుండా ఉండటం నా వల్ల కావట్లేదు' అనుకోకుండా 'నేనెందుకు మానేయలేను' అని ఆశావహ దృక్పథంతో ఆలోచించండి.

వేరే వ్యాపకం: తరచూ పొగాకు ఉత్పత్తుల వినియోగం మనల్ని వాటికి బానిసల్ని చేసేస్తుంది. దాన్ని వదిలించుకోవాలంటే... మనసు అటువైపు లాగేస్తున్నప్పుడు వేరే వ్యాపకం పెట్టుకోవాలి. ఒకవేళ ఫోన్‌లో మాట్లాడుతూ పొగ తాగుతుంటే... మీ వద్ద ఓ పెన్ను, పేపర్ పెట్టుకోండి. తద్వారా అటెన్షన్‌ను డైవర్ట్ చేయవచ్చు.

ఒకే ఒక్కటి: 'ఒకే ఒక్క సిగరెట్' తాగేసి ఆపేద్దామని ఎప్పుడూ అనుకోవద్దు. అలా అనుకుంటే మన కంటే పెద్ద తెలివితక్కువ వారు ఎవరూ ఉండరు. ఒక్కటితో ఆపడం అసాధ్యం. ఆ తరువాత మరొకటి తాగాలనిపిస్తుంది. చివరకు ఇది మళ్లీ వ్యసనానికి దారి తీస్తుంది.

ఫిట్‌నెస్ మంత్ర: ఏదైనా శారీరక శ్రమ ఉండే పనేదైనా చేస్తే నికోటిన్‌పైకి పెద్దగా మనసు వెళ్లదు. సో... రోజూ వ్యాయామం అలవాటు చేసుకోండి. వీలైతే నలుగురితో కలిసి చేస్తే... వేరే విషయంపైకి ధ్యాస మళ్లదు.

రిలాక్సేషన్ టెక్నిక్స్: సాధారణంగా సిగరెట్ అలవాటు ఉన్నవారు ఒత్తిడిలో ఎక్కువ తాగుతుంటారు. అలాంటి పరిస్థితుల్లో ఒత్తిడిని అధిగమించడానికి దీర్ఘ శ్వాస వ్యాయామం, యోగా, ధ్యానం, మసాజ్ వంటి రిలాక్సేషన్ టెక్నిక్స్‌ను సాధన చేయడం ద్వారా పునరుత్తేజాన్ని పొందవచ్చు.

కంగారు వద్దు: ఒక్కసారిగా ధూమపానం మానేయడం వల్ల తల, కడుపు, గొంతు నొప్పి, ఒత్తిడి, నిస్సత్తువ, నోరు ఎండిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాటికి కంగారు పడాల్సిన పనిలేదు. ఓర్పుతో ఉంటే నిదానంగా అవే తగ్గిపోతాయి.

వారం తరువాత: పొగ తాగడం ఆపేసిన వారం తరువాత ఉత్సాహంగా ఉండటానికి ప్రయత్నించండి. వాకింగ్‌కు వెళ్లండి. సంగీతం వినండి. స్నేహితులతో గడపండి. మిమ్మల్ని మీరు తీరిక లేకుండా ఉంచుకోండి. సిగరెట్‌పైకి మనసు లాగేసినప్పుడల్లా మింట్, క్యాండీ వంటివి చప్పరించండి. సాధ్యమైనన్ని నీళ్లు తాగండి. ఓ గ్లాస్ చల్లటి నీరు మీ శరీరంలోని విష పదార్థాలను తొలగిస్తుంది. ధూమపానం కోసం ఆరాటాన్ని తగ్గిస్తుంది.



# వరుణ్ కోసం మెగాబ్రదర్ సెలక్షన్.. రెడీ అవుతున్నాయా..?



మెగాహీరో వరుణ్ తేజ్.. ఈమధ్య కెరీర్ పరంగా చాలా జాగ్రత్తపడుతున్నాడు. ఆచితూచి సినిమాలను సెలెక్ట్ చేసుకుంటున్నాడు. అయితే ఇప్పటికే మెగాబ్రదర్ నాగబాబు.. వరుణ్ పెళ్లి పై క్లారిటీ ఇచ్చిన విషయం తెలిసిందే. 'మా వరుణ్ ఎలాంటి పెళ్లి చేసుకున్నా పర్లేదు. అంటే ప్రేమపెళ్లి లేదా అరెంజ్ మ్యారేజ్ ఏదైనా ఓకే. కానీ అమ్మాయి వరుణ్ కి అన్నివిధాలా సరిజోడినా కాదా అనేది చూస్తాం' అంటూ కొడుకు పెళ్లి గురించి ఇది వరకే మనసులో మాట బయట పెట్టేసాడు నాగబాబు. ప్రస్తుతం తన కెరీర్ విజయవంతంగా రన్ చేస్తున్నాడు వరుణ్. ప్రస్తుతం బాక్సింగ్ నేపథ్యంలో గని సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అంతేగాక మరో వైపు ఎఫ్3 కూడా కంప్లీట్ చేస్తున్నాడు. డిఫరెంట్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంటున్నాడు మెగాహీరో. అయితే మెగాస్టార్ చేసిన సినిమాలను వరుణ్ తో చేయించాలనే ఆలోచనలో ఉన్నట్లు మెగాబ్రదర్ నాగబాబు గతంలోనే చెప్పేసాడు. ఇప్పుడు అవే సినిమాలను లైన్ చేస్తున్నట్లు సమాచారం. అయితే మెగాస్టార్ చేసిన సినిమాల్లో ఏ సినిమాను వరుణ్ తో రీమేక్ చేస్తారు?' అని అడిగిన ప్రశ్నకు.. నాగబాబు స్పందించి 'అన్నయ్య చేసిన సినిమాల్లో నాకు 'ఛాలెంజ్' అంటే చాలా ఇష్టం. సత్యానంద్ గారు మంచి స్క్రీన్ ప్లేను అందించారు. వరుణ్ తేజ్ బాడీ లాంగ్వేజ్ కి ఈ సినిమా అయితే బాగుంటుందని అనిపిస్తూ ఉంటుంది. అలాగే 'కొదమసింహం' కూడా నాకు బాగా నచ్చుతుంది. హాలీవుడ్ సినిమా స్ఫూర్తితో ఆ సినిమాను రూపొందించారు. కౌబాయ్ గా అన్నయ్య యాక్టింగ్ ఇరగదీసారు. ఈ సినిమా కూడా వరుణ్ తేజ్ కు సెట్ అవుతుందని అన్పిస్తుంది. కానీ అన్నయ్య చేసిన సినిమాలను రీమేక్ చేసి మెప్పించడం వరుణ్ కు సవాలే అవుతుంది" అంటూ మెగాస్టార్ సినిమాలను మెల్లగా స్క్రిప్ట్ వైపు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నట్లు టాక్. అలాగే పర్సనల్ గా వరుణ్ మైండ్ లో పవర్ స్టార్ జానీ సినిమా చేయాలనే ఆశతో ఉన్నట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. చూడాలి మరి ముందుగా ఏ సినిమా రీమేక్ పట్టాలెక్కుతుందో!

# స్నేహితుడు వాసు కోసం లంగరేస్తున్న బన్ని



స్టార్ హీరో అల్లు అర్జున్ కి వాసు ఎంత మంచి స్నేహితుడో తెలిసిందే. బన్ని వాసు అని పిలిచేంత గొప్ప స్నేహం. ఇక బన్ని వాసు నిర్మాతగా జీఏ 2 బ్యానర్ స్థాపించి ఏళ్లు అయ్యింది. ఇప్పటికే ఈ సంస్థ నుంచి టాలీవుడ్ లో ఎన్నో బ్లాక్ బస్టర్లు వచ్చాయి. బాస్ అల్లు అరవింద్ సమర్పకుడిగా బన్ని వాస్ ఈ చిత్రాలన్నిటినీ నిర్మిస్తే వాటన్నిటికి బన్ని ప్రమోటర్ గా ఉన్నారు. అంటే బన్ని వాస్ సినిమాలకు అరవింద్ - అర్జున్ జోడీ పెద్ద అండ అన్నమాట. ఇప్పుడు చావు కబురు చల్లగా చిత్రానికి ఈ త్రయం కలిసే పని చేశారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పతాకంపై బన్ని వాసు నిర్మించిన తాజా చిత్రం చావు కబురు చల్లగాకి బన్ని ప్రమోషన్కి రెడీ అయ్యారు. కార్తికేయ- లావణ్య త్రిపాఠి జంటగా కౌశిక్ పెగళ్లపాటి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మార్చి 9న జరగనున్న ప్రీ-రిలీజ్ వేడుకతో హైప్ పెంచేందుకు బన్ని బరిలో దిగుతున్నారు. మార్చి 19 రిలీజ్ సందర్భంగా ఈ రెండు వారాలు ప్రచారం హోరెత్తించేయనున్నారట. మొన్నటికి మొన్న పైన పటారం సాంగ్ లో కార్తికేయ- అనసూయ మాస్ స్టెప్పులు ఆకట్టుకున్నాయి. కార్తికేయ బస్తి బాలరాజు ఫస్ట్ లుక్.. .. ఆ తర్వాతా లావణ్య ఫస్ట్ లుక్ గ్లింప్స్ మెరిపించాయి. ప్రీరిలీజ్ వేదిక లో బన్ని స్పీచ్ తో మరింత హైప్ పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఆగని ఆర్ఆర్ఆర్ రికార్డ్స్.. 100 మిలియన్స్ దాటిన భీమ్ టీజర్!



స్టార్ హీరోస్ ఎన్టీఆర్ - రామ్చరణ్ ప్రధానపాత్రలలో నటిస్తున్న భారీచిత్రం ఆర్ఆర్ఆర్. పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతున్న ఈ మల్టీస్టారర్ మూవీకి ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ కంప్లీట్ చేసుకుంటున్న ఈ సినిమా విడుదలకోసం దేశవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు భారీ అంచనాలతో ఎదురుచూస్తున్నారు. పీరియాడిక్ ఫిక్షన్ డ్రామాగా బ్రిటిష్ టైంలో జరిగిన సంఘటనల నేపథ్యంతో ఆర్ఆర్ఆర్ మూవీని రూపొందిస్తున్నారు మేకర్స్. ఈ సినిమాలో ఎన్టీఆర్ క్యారెక్టర్లో చాలా వెరియేషన్స్ కనిపిస్తాయని సినీవర్గాల టాక్. ఆల్రెడీ క్లైమాక్స్ దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్ తో పూర్తవుతుందట. 'రామరాజు ఫర్ భీమ్' ప్రోమో చూస్తేనే అర్థమవుతుంది ఎన్టీఆర్ ఏ రేంజిలో దర్శనం ఇవ్వనున్నాడో.. ఈ నేపథ్యంలో కొన్ని సన్నివేశాల్లో ఎన్టీఆర్ సాధారణంగా మరికొన్ని సన్నివేశాల్లో కండలు తిరిగిన దేహంతో కనిపించనున్నట్లు తెలుస్తుంది. కొమరం భీమ్ పాత్రకోసం ఎన్టీఆర్ తన బాడీని మేకోవర్ చేయడం గమనించవచ్చు. అయితే రాంచరణ్ బర్త్ డే రోజు 'భీమ్ ఫర్ రామరాజు' స్పెషల్ ప్రోమో ఎన్టీఆర్ వాయిస్ తో ఓ రేంజిలో వైబ్రేషన్స్ సృష్టించింది. అలాగే ఎన్టీఆర్ 'రామరాజు ఫర్ భీమ్' ప్రోమో కూడా సోషల్ మీడియాలో రికార్డులు క్రియేట్ చేస్తోంది. కొమరం భీమ్ పాత్రలో ఎన్టీఆర్ వీరంగం సృష్టిస్తాడని ప్రోమో చూస్తే తెలుస్తుంది. ప్రస్తుతం ఎన్టీఆర్ రామరాజు ఫర్ భీమ్ వీడియో యుట్యూబ్లో రికార్డులు బ్రేక్ చేస్తోంది.

తాజాగా ఈ ప్రోమో 100మిలియన్స్ వ్యూస్ సొంతం చేసుకున్నట్లు ఫ్యాన్స్ తెలిపారు. అయితే యూట్యూబ్ లో 64.5 మిలియన్స్ ఫేస్బుక్ లో 28.3 మిలియన్స్ ఇన్స్టాగ్రామ్ లో 7.37 మిలియన్స్ తో రామరాజు ఫర్ భీమ్ 100 మిలియన్స్ కంప్లీట్ చేసిందని సెలెబ్రేట్ చేసుకుంటున్నారు. అక్టోబర్ 13న సినిమా విడుదల కాబోతుంది.

# మరీ టూమచ్ గా అలా ఊరించకు డార్లింగ్!



టీజ్ చేయడం .. నేటితరం తారలకు ఉండాల్సిన ప్రధాన లక్షణం. సోషల్ మీడియా డిజిటల్ యుగంలో ఇవే ప్రధాన ఆయుధాలు. ఒక్క వేడెక్కించే ఫోటోతో లక్షలాది మందిని అనుచరులుగా మార్చుకోవచ్చు. అంతటి గొప్ప ప్రభావం ఉంది ఈ టెంప్టింగ్ వెనక.చూస్తుంటే బుట్టబొమ్మ కూడా దీనిని బాగా ఔపోషణ పట్టేసినట్టే కనిపిస్తోంది. మలైకా .. దిశా పటానీ.. జాన్వీ కపూర్.. సారా అలీఖాన్ .. వీళ్లందరికీ రఫ్ కాంపిటీషన్ ఇస్తోంది. ఇదిగో రేస్ లో నేనూ ఉన్నా అంటూ ఎలాంటి ఫోటోని షేర్ చేసిందో చూశారు కదా? మరీ అలా థైస్ కి అతుక్కుని అందాల్ని ఎలివేట్ చేస్తున్న ఈ స్పోర్ట్స్ వేర్ హాట్ టాపిక్ గా మారింది. అయినా అలా ఏటవాలు ఎత్తులను ఒత్తుకుపోయేంతగా తొడుక్కోవాలా? అంటూ యూత్ ఒకటే ఇదైపోతున్నారు. ముందు టీజ్ చేస్తారు.. ఆనక వెంటపడ్డారంటారు! అంటూ వెనకటికి ఒక మంత్రిగారు వ్యాఖ్యానించినట్టు... అంతగా టీజ్ చేయడం కూడా ఇబ్బందికరమేనేమో!! అంటూ కొందరు పాత సంగతుల్ని గుర్తు చేసుకుంటున్నారు. పూజా నటించిన రాధేశ్యామ్.. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ బ్యాక్ టు బ్యాక్ ట్రీటిచ్చేందుకు థియేటర్లలోకి రానున్నాయి. మరోవైపు బాలీవుడ్ లోనూ పూజా వరుస ప్రాజెక్టులతో బిజీ గా ఉంది.

# టపు టపు టపోరి కన్యా కుమారి..!



అతిలోక సుందరి శ్రీదేవి నటవార సురాలిగా బాలీవుడ్ లో ఆరంగేట్రం చేసిన జాన్వీ కపూర్ తన కెరీర్ ని వేగంగా పరుగులెత్తించడంలో సఫలమవుతోంది. హార్డ్ వర్క్ లో జాన్వీ తన మామ్ నే తలపిస్తోందన్న ప్రశంసలు అందుకుంటోంది. శ్రీదేవి అంతటి విజువల్ బ్రిలియెన్సీ ని ఈ నాలుగైదు సినిమాల కిడ్ నుంచి ఆశించడం సరైనది కాద నేది అభిమానుల అభిమతం. అయి తే శ్రీదేవి లెగసీని నడిపించేందుకు ఇప్పుడు తనకు ఇంటి నుంచే పోటీ ఎదురు కానుంది. తన సోదరి ఖుషీ కపూర్ త్వరలోనే తెరంగేట్రానికి సిద్ధమవుతున్న వేళ జాన్వీ ఉబ్బితబ్బిబ్బవుతోంది. అదంతా అటుంచితే.. కేవలం ఇంటి నుంచి మాత్రమే కాదు.. వెలుపలి నుంచి జాన్వీకి విపరీతమైన పోటీ ఉంది. సాటి నటవారసురాళ్లు కూడా ఇప్పటికే క్రేజీ సినిమాలతో బ్లాక్ బస్టర్లు అందుకుంటూ కెరీర్ పరంగా దూసుకుపోతున్నారు. అందుకే జాన్వీ హార్డ్ వర్క్ ని అస్సలు విడిచి పెట్టదు. ఈ భామ నిరంతరం జిమ్ యోగా ధ్యానం అంటూ లైఫ్ ని ఎంతో క్రమశిక్షణతో నడిపిస్తోంది. ఇక పబ్లిక్ అప్పియరెన్స్ పరంగానూ జాన్వీ ఎక్కడా తగ్గదు. బికినీ షూట్.. స్విమ్ సూట్.. పొట్టి నిక్కరు.. డ్రెస్ ఏదైనా జాన్వీ ఫోటోషూట్లతో అగ్గి రాజేస్తుంది. తాజాగా వైట్ అండ్ వైట్ స్పోర్ట్ లుక్ తో ముంబై వీధుల్లో వెళుతూ సర్ ప్రైజ్ చేసింది. చూస్తుంటే జాన్వీ వర్కవుట సెషన్స్ కి వెళుతున్నట్టే కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. జాన్వీ నటించిన రూహీ అఫ్జా.. దోస్తానా 2 రిలీజ్ కి రావాల్సి ఉంది.


మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)



జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989